తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు నిర్మల్ | మంచిర్యాల
ప్రొ. జయశంకర్ భూపాలపల్లి కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

శనివారం
10 అక్టోబర్ 2026 | పేజీలు - 12

## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- జిల్లా ఎస్పీ నితికా పంత్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09(జనంసాక్షి ):** దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ సూచించారు. మండపాల నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి అని అన్నారు. ఉత్సవాల సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, మండపాల నిర్వాహకులు పోలీసుల మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.

ప్రజలు, వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలి. రహదారులు, కాలిబాటలను ఆక్రమించరాదు అని అన్నారు. ప్రతి మండపం వద్ద భద్రతా దృష్ట్యా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలి అని అన్నారు. విద్యుత్ శాఖ నుంచి ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు, షార్ట్ సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి అని అన్నారు. ఇతర మతాల వారి మనోభావాలను దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం,వివాదాస్పద పాటలు లేదా రెచ్చగొట్టే అంశాలను ప్రసారం చేయడం చేయరాదు అని అన్నారు. మండపాల వద్ద భద్రత, క్రమశిక్షణను పర్యవేక్షించేందుకు నిర్వాహకులు ప్రత్యేక వాలంటీర్లను ఏర్పాటు చేసి, వారి వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌లో అందజేయాలి అని అన్నారు. ఉత్సవాల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు. సోషల్ మీడియా పుకార్ల పట్ల అప్రమత్తంగా ఉండాలి అని అన్నారు. సోషల్ మీడియాలో వచ్చే పుకార్లను నమ్మవద్దని, నిర్ధారణ కాని వార్తలు, సందేశాలు, వీడియోలను ఇతరులకు ఫార్వర్డ్ చేయవద్దని మిగతా 15లో..

# కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు

- ఆత్మీయ సమ్మేళనంలో భగ్గుమన్న వర్గ విభేదాలు
- ఎమ్మెల్యే తీరుపై నాయకులు, ప్రజాప్రతినిధుల బహిరంగ విమర్శలు
- కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు లేదంటూ ఆవేదన
- ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే ప్రాధాన్యం ఇస్తున్నారంటు ఆగ్రహం
- ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలని సూచన



**బయ్యారం అక్టోబర్ 9(జనంసాక్షి) :** బయ్యారం,గార్ల మండలాల కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత విభేదాలు బయటపడ్డాయి. స్థానిక సంస్థల ఎన్నికల నాటినుండి నివురుగప్పిన నిప్పులా ఉన్న అసమ్మతి జ్వాలలు ఆత్మీయ సమ్మేళనం వేదికగా ఒక్కసారిగా భగ్గుమన్నాయి. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు తగిన గుర్తింపు, గౌరవం లభించడం లేదంటూ బయ్యారం, గార్ల మండలాలకు చెందిన పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను గెలిపించేందుకు శ్రమించిన తమను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారంటూ బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. బయ్యారం, గార్ల మండలాల కాంగ్రెస్ నాయకుల కార్యకర్తల, ప్రజాప్రతినిధుల ఆత్మీయ సమ్మేళనం స్థానిక కొందండ రామయ్య ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎంపీపీ కిషన్ నాయక్ అధ్యక్షతన శుక్రవారం జరిగింది. గత స్థానిక సంస్థల ఎన్నికల నుంచి రెండు మండలాల్లోనూ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత విభేదాలు ఈ సమావేశంలో స్పష్టంగా బయటపడ్డాయి. ఆత్మీయ సమ్మేళనం కాస్తా ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసమ్మతి గళం వినిపించే వేదికగా మారింది.

పార్టీ కష్ట కాలంలో ఉన్నప్పుడు పార్టీనీ బలోపేతం చేయడం కోసం కష్టపడి పనిచేసిన నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలను పక్కనపెట్టి, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి ఎమ్మెల్యే పెద్దపీట వేస్తున్నారంటూ నాయకులు ఆరోపించారు. పార్టీ కోసం శ్రమించిన వారిని గుర్తించకపోవడం, వారికి సముచిత గౌరవం ఇవ్వకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మండలానికి ఒక గుమస్తాను నియమించుకున్న తరహాలో పాలన సాగిస్తున్నారంటూ ఎమ్మెల్యే తీరును విమర్శించారు. కార్యకర్తల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలతో తమ అసంతృప్తిని వ్యక్తం చేశారు.

### ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అన్యాయం

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులోనూ పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు అన్యాయం జరుగుతోందని పలువురు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులైన కార్యకర్తలకు ప్రాధాన్యత దక్కడం లేదని, ఎమ్మెల్యేకు అనుకూలంగా ఉన్నవారికి 50 వేల వరకు డబ్బులు తీసుకొని ఇళు ఇప్పిస్తున్నారంటూ ఆరోపణలు చేశారు.

### 50 వేల మెజార్టీతో గెలిపించాం

ఎమ్మెల్యే తన వ్యవహారశైలిని మార్చుకోవాలని నాయకులు, కార్యకర్తలు సూచించారు. ఎన్నికల సమయంలో రేయింబవళ్లు శ్రమించి, 50 వేల పై చిలుకు భారీ మెజార్టీతో గెలిపించిన కార్యకర్తలనే విస్మరిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. తమ కష్టాన్ని గుర్తించకుండా, తమను నిర్లక్ష్యం చేస్తే రాజకీయంగానే సమాధానం చెబుతామని తేల్చి చెప్పారు.

### పెద్ద చెరువు నీటి విషయంలోనూ విమర్శలు

బయ్యారం పెద్ద చెరువు నీటిని రైతులకు సద్వినియోగం చేయడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారంటూ నాయకులు విమర్శించారు. చెరువులో నీరు ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించే విషయంలో సకాలంలో మిగతా 15లో..

## ప్రజలకు మరింత చేరువగా 'ప్రజాసేతు' డిజిటల్ వేదిక

- జిల్లా కలెక్టర్ కె.హరిత



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 09(జనంసాక్షి ):** జిల్లాలో ప్రజా సమస్యలను వేగవంతంగా, పారదర్శకంగా పరిష్కరించడంతో పాటు, ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో ఆధునిక సాంకేతికతతో పనిచేసే ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'కె.బి. ఆసిఫాబాద్ ప్రజాసేతు' ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో నెలకొన్న పౌర సమస్యలు, మౌలిక వసతుల కొరత, పారిశుద్ధ్యం, త్రాగునీరు, రహదారులు, వీధి దీపాలు తదితర సమస్యలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను సులభంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ఈ డిజిటల్ వేదిక ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యాలయాల చుట్టూ తిరుగవలసిన అవసరం లేకుండా, వాట్సాప్ ద్వారా ఫిర్యాదులను సమర్పించే సదుపాయాన్ని కల్పించడం జరిగిందని తెలిపారు. వాట్సాప్ నంబర్: 7569986036 ద్వారా ప్రజలు తమ సమస్యలను సందేశం రూపంలో పంపవచ్చని సూచించారు. ఫిర్యాదును పంపేటప్పుడు సమస్యకు సంబంధించిన వివరాలు, సమస్య ఉన్న ప్రాంతం పేరు, గ్రామం / వార్డు వివరాలు, అవసరమైతే సంబంధిత ఫొటోలను జత చేయడం ద్వారా సమస్యను స్పష్టంగా తెలియజేయవచ్చని తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక వెబ్‌సైట్‌ను ht tps://kbasi-fabad.in అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావచ్చు అని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవడం ద్వారా ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సమర్థవంతంగా స్వీకరించి, సంబంధిత సమస్యలను గుర్తించి, పరిష్కార ప్రక్రియను మరింత సులభతరం చేయడమే కకాకుండా ప్రభుత్వ సేవలలో పారదర్శకతను పెంపొందించడం, ప్రజా సమస్యల పరిష్కారంలో జవాబుదారీతనాన్ని బలోపేతం చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.



## ప్రజాసేవే పోలీసుల పరమ ధ్యేయం

- వరంగల్ సీపీ ఎన్. శ్వేతా

**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 9 (జనం సాక్షి) :** వార్షిక తనిఖీలో భాగంగా, ముల్కనూరు పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం తనిఖీ చేసిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్. ఎస్సై ఎమ్.రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, స్టేషన్ పరిసరాలు, సిబ్బంది విధుల నిర్వహణ తదితర అంశాలను కమిషనర్ గారు క్షుణ్ణంగా పరిశీలించారు. పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి, గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న చిన్న సమస్యలకు కూడా పోలీసులనే ఆశ్రయిస్తారని అలాంటి సమయంలో వారికి సరైన న్యాయం చేసి వారి మెప్పును పొందాలని, ప్రజలకు సేవ చేయటం పోలీసులకు దక్కిన గౌరవమని, ప్రజాసేవే పోలీసుల పరమ ధ్యేయం అని తెలిపారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా పనిచేయాలని సీపీ సూచించారు. అనంతరము కమిషనర్ స్టేషన్ ఆవరణలో మామిడి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సి ఐ కె శ్రీను, ముల్కనూరు ఎస్సై ఎమ్. రాజు, వంగర ఎస్సై దివ్య తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలు అభినందనీయం

# బిజెపి పార్టీ భూపాలపల్లి నియోజకవర్గ ఇంచార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి



**టేకుమట్ల అక్టోబర్ 09 జనంసాక్షి** సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా టేకుమట్ల బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు ఆధ్వర్యంలో మండలంలోని దుబ్యాల, మందలోరిపల్లె గ్రామాల్లో నిర్వహించిన అంగన్వాడీ కేంద్రాల సందర్శన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్ల సేవలను అభినందిస్తూ వారిని శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా భూపాలపల్లి నియోజకవర్గం ఇన్చార్జ్ చందుపట్ల కీర్తి రెడ్డి మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే లక్ష్యంగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పోషణ్ అభియాన్ పథకం . మంచి ఫలితాలను సాధిస్తుందని వారు తెలియజేశారు. అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యకు పునాదులుగా నిలుస్తున్నాయని అన్నారు. పిల్లలకు తొలి గురువులు అంగన్వాడీ టీచర్లేనని, ఆరోగ్యవంతమైన బాలలే వికసిత భారతదేశానికి బలమైన పునాదులని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం, పోషణ విషయంలో అంగన్వాడీ సిబ్బంది అందిస్తున్న సేవలు ఎంతో కీలకమన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని కీర్తి రెడ్డి అన్నారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో ఆశా వర్కర్లు క్షేత్రస్థాయిలో అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా నిస్వార్థంగా పనిచేస్తున్న ఆశా వర్కర్ల సేవలను గుర్తించి గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు ఎంతో విలువైనవని, వారి కృషి వల్ల ప్రభుత్వ సంక్షేమ, ఆరోగ్య కార్యక్రమాలు ప్రజలకు మరింత చేరువవుతున్నాయని కీర్తి రెడ్డి గారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్ , మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య యువమోర్చా జిల్లా నాయకుడు పంజాల కుమార్ గౌడ్ , జిల్లా నాయకుడు కుర సురేందర్ రెడ్డి , మండల నాయకులు గుండెబోయిన తిరుపతి , చిట్యాల విజయ్ కుమార్ , బూత్ అధ్యక్షుడు పల్లె శ్రీకాంత్ , వీరారెడ్డి శ్రీకాంత్ , మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో యువత ముందంజలో ఉండాలి

## యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్



**చెన్నారావుపేట, అక్టోబర్ 9 ( జనం సాక్షి):** రాజకీయాల్లో యువకులు ముందుండాలని యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు బండి హరీష్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నికను నిర్వహించారు.యువజన కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షులుగా బొమ్మరబోయిన కుమారస్వామి, ఉపాధ్యక్షులుగా గుర్రాల వీరేష్, ప్రధాన కార్యదర్శిగా భాషబోయిన మహేష్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ గా మంచాల అమరేష్ ను ఎన్నుకున్నట్లు ప్రకటించారుఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ జిల్లా యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ రూపిక శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని రానున్న రోజుల్లో యువత రాజకీయాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు.యువత హక్కుల కోసం పోరాడాలని నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాల కోసం కృషి చేయాలని గ్రామాల అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషించాలని పేదలు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని యువ నాయకత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమం లో గ్రామ సర్పంచ్ జినుకల కనుకమల్లు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు భాషబోయిన రమేష్, ఉప సర్పంచ్ పానుగంటి కొమురయ్య, భాషబోయిన వెంకన్న, మంచాల సదయ్య, వార్డ్ సభ్యులు ఎదురబోయిన భద్రయ్య, భాషబోయిన బిక్షపతి, కర్రె రాజ్ కుమార్, బత్తిని వీరన్న, పానుగంటి ప్రభాకర్, పుటికల రాజు, భాషబోయిన మహేందర్, నూకల ముత్తయ్య, టేకుల బాబు, భాషబోయిన జనార్దన్, కర్రె శ్రీను, పోతరాజు దిలీప్, భాషబోయిన జైహింద్, అర్జున్, అరకాల భరత్, తదితరులు పాల్గొన్నారు.

# శరన్నవరాత్రి మహోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ




**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 9 (జనం సాక్షి) :** శుక్రవారం హనుమకొండ ప్రెస్ క్లబ్ నందు శ్రీ హనుమద్గిరి పద్మాక్షి దేవస్థానం ఏకశిలా నగరం హనుమకొండ జిల్లా శరన్నవరాత్రి మహోత్సవం శుభ ఆహ్వాన పత్రిక ఆవిష్కరించడం జరిగింది ఈనెల 11 ఆదివారం నుండి22 గురువారం వరకు అమ్మవారిని వివిధ అలంకరణలో కార్యక్రమాలు నిర్వహించబడును ఆదివారం ఉదయం 9 గంటలకు జ్యోతి ప్రజ్వలన హనుమకొండ పశ్చిమ శాసనసభ్యులు నాయని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులచే మరియు కూడా చైర్మన్ గుండు సుధారాణి ప్రభాకర్ దేవాలయ కమిటీ సభ్యులు ముఖ్య అతిథులుగా పాల్గొనడం జరుగుతుందని తెలిపారు ప్రతిరోజు సుప్రభాతము అభిషేకము అలంకరణ ఉపనిషత్ పారాయణం చండీ సప్తశతి హవనము నవగ్రహ రుద్ర హవనము సాయంకాలము లలిత శాస్త్ర పారాయణం చతుర్వేద స్వస్తి హారతి మంత్రపుష్పం భవద్గీత పారాయణం మొదలైన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. ప్రెస్ మీట్‌లో నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని గారు నీలారపు రాజ్ కుమార్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త కనుకుంట్ల రవికుమార్ ప్రచార కార్యదర్శి మునుగోటి రమేష్ దేవాలయ అభివృద్ధి కార్యకర్త గోవర్ధన వెంకటరమణాచారి తదితరులు పాల్గొన్నారు.

## కెరమెరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**కెరమెరి, అక్టోబర్ 9(జనంసాక్షి)** కెరమెరి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నాడు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉపేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను విద్యార్థినీలు ఉత్సాహంగా జరుపుకున్నారు. విద్యార్థినీలు సంప్రదాయ దుస్తులు ధరించి, పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ ఆడి పాడారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉపేంద్ర మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక అని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడే బాధ్యత విద్యార్థులపై ఉందని అన్నారు. తెలంగాణ సంస్కృతిని భవిష్యత్ తరాలకు అందించాలని సూచించారు. బతుకమ్మ పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. విద్యార్థులంతా ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ సంబరాలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కావ్య, నవీన్ రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# దుర్గాదేవి ఆలయానికి రూ.1.05 లక్షల ఆర్థిక సహాయం

## కనకాపూర్ గ్రామ ప్రజల తరఫున నల్ల వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు



**లక్ష్మణ చందా, అక్టోబర్ 9 (జనం సాక్షి):** మండలంలోని కనకాపూర్ గ్రామంలోని శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయానికి రంగులు వేయించేందుకు రూ. 1,05,000 ఆర్థిక సహాయం అందించిన వడ్యాల్ గ్రామానికి చెందిన నల్ల వినయ్ రెడ్డికి కనకాపూర్ గ్రామ ప్రజలు, శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల కోరిక మేరకు అమ్మవారి ఆలయ అభివృద్ధి, సుందరీకరణకు ఆయన ముందుకు వచ్చి ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయానికి సహకారం అందించడం ద్వారా ఆయన దైవభక్తితో పాటు సమాజం పట్ల తనకున్న బాధ్యతను చాటుకున్నారని కొనియాడారు. గ్రామంలోని ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం ఎంతో స్ఫూర్తిదాయకమని, నల్ల వినయ్ రెడ్డి అందించిన సహాయాన్ని కనకాపూర్ గ్రామ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని తెలిపారు. శ్రీ దుర్గాదేవి అమ్మవారి ఆశీస్సులు నల్ల వినయ్ రెడ్డి కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని, ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవిస్తూ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

## పెద్ది స్వప్నను మర్యాదపూర్వకంగా

# కలిసిన సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్




**చెన్నారావుపేట, అక్టోబర్ 9 ( జనం సాక్షి):** నర్సంపేట మాజీ ఎమ్మెల్యే దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి సతీమణి వరంగల్ జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ పెద్ది స్వప్నను పాపయ్యపేట గ్రామ సర్పంచ్ బుర్ర సుదర్శన్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. హనుమకొండలోని ఆమె నివాసంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకొని దివంగత మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి జ్ఞాపకాలను స్మరించుకుంటూ కొంతసేపు ఆత్మీయంగా మాట్లాడి గ్రామానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల కోశాధికారి గుర్రం రవి, గ్రామ అధ్యక్షులు మొర్రి కట్టయ్య, వార్డు సభ్యులు మరాఠీ కట్టయ్య, బర్ల యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

మానవత్వాన్ని చాటుకున్న 4వ బెటాలియన్ అధికారులు, సిబ్బంది

# కానిస్టేబుల్‌కు ఆర్థిక సహాయం



**ఖిలా వరంగల్ మండలం, అక్టోబర్ 09 (జనం సాక్షి)** వరంగల్ నగరంలోని మామునూరు 4వ బెటాలియన్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న గుగులోతు రవీందర్ ఇటీవల మాతృవియోగానికి గురయ్యారు. ఆయన తల్లి గుండె సంబంధిత సమస్యతో బాధపడుతూ ఇటీవల కన్నుమూశారు. ఈ కష్టసమయంలో తోటి కానిస్టేబుల్‌కు అండగా నిలవాలని భావించిన ఈ-కంపెనీ సిబ్బంది మరియు అధికారులు మానవత్వంతో స్పందించారు. రవీందర్ కుటుంబానికి భరోసా కల్పిస్తూ తోటి సిబ్బంది, అధికారులు కలిసి సేకరించిన రూ. 43,100 (నలభై మూడు వేల ఒక వంద రూపాయల) ఆర్థిక సహాయాన్ని కమాండెంట్ ఎన్.వి. సత్య శ్రీనివాస్ రావు గారి చేతుల మీదుగా ఈ నగదును కానిస్టేబుల్ రవీందర్‌కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ... తోటి ఉద్యోగి కష్టాల్లో ఉన్నప్పుడు సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి ఆర్థికంగా, మానసికంగా అండగానిలవడం అభినందనీయమన్నారు. రవీందర్ కుటుంబానికి 4వ బెటాలియన్ ఎల్లప్పుడూ తోడుగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రాజు, ఆర్ఐలు కార్తీక్, వెంకటేశ్వర్లు, ఈ-కంపెనీ ఆర్ఐ రాంప్రసాద్, ఆర్ఎస్ఐ నవీన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ తపాలశాఖ దినోత్సవ వేడుకలు



**గోవిందరావుపేట అక్టోబర్09 (జనం సాక్షి )** :ప్రపంచ తపాల శాఖ దినోత్సవ వేడుకలను పసర గ్రామంలో తపాలా కార్యాలయం నందు వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో శుక్రవారం నాడు సబ్ పోస్ట్ మాస్టర్ గా విధులు నిర్వహిస్తున్న బీరెల్లి రమేష్‌ని ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా బీరెల్లి రమేష్ మాట్లాడుతూ భారత తపాలా శాఖ ఈ సమాజానికి చేసిన సేవ అనిర్వచనీయం. స్వాతంత్ర్యానికి పూర్వం నుండి నేటి డిజిటల్ యుగం వరకు ప్రజలను చేరువ చేస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పోస్టల్ శాఖ పనిచేస్తోందనీ, ఒకప్పుడు ఉత్తరాల ద్వారా కుటుంబాలను, దేశ సరిహద్దుల్లో ఉన్న సైనికులను ప్రజల మధ్య బంధుత్వాన్ని కలిపిన ఘనత తపాలా శాఖదే అన్నారు. స్వాతంత్ర్యం తరువాత మనీ ఆర్డర్లు, సేవింగ్స్, ఇన్సూరెన్స్, ఆధార్, పాస్ పోర్ట్, పెన్షన్లు ఉత్తరాలు, మధురగుడి డిజిటల్ పేమెంట్ సేవలతో ప్రతి గ్రామానికి, ప్రతి గడపకు చేరేలా విధులు నిర్వహిస్తోంది. నేడు టెక్నాలజీ ఎంత పెరిగినా పోస్టల్ శాఖకు ఉన్న నమ్మకం, విశ్వసనీయత చెక్కుచెదరలేదు. ఇలాంటి గొప్ప శాఖలో పనిచేయడం మా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు మేము ఎల్లప్పుడూ కృషి చేస్తాము అని అన్నారు. ప్రపంచ తపాల దినోత్సవం ప్రతి ఏటా అక్టోబర్ 9న జరుపుకుంటారని, ప్రజలందరూ పోస్టల్ సేవలను వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ తీరును ఖండిస్తూ కాంగ్రెస్ నిరసన

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిని పదవి నుంచి తొలగించాలని ఢిల్లీలో ఇండియా కూటమి ఎంపీలు చేపట్టిన నిరసనపై పోలీసుల చర్యలను ఖండిస్తూ భూపాలపల్లి పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బట్టు కరుణాకర్ మాట్లాడుతూ ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీతో పాటు ఇండియా కూటమి నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపే హక్కును కాలరాయడం సరికాదన్నారు. ఓటర్ల హక్కుల కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఒకే వేదికపై.. 142 కంపెనీలు

- రెండు గంటల్లో 600 మందికి పైగా ప్రాథమిక ఎంపిక
- ఎమ్మెల్యే గండ్ర చొరవతో మెగా జాబ్‌మేళా
- వేలమందికి ఉద్యోగావకాశాలు
- యువత నైపుణ్యాలు పెంచుకుంటే రూ.70 వేల వరకు వేతనం
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- భూపాలపల్లిలో మెగా జాబ్ మేళా ఫుల్ సక్సెస్





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా భూపాలపల్లి జిల్లా కేంద్రంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళా ఫుల్ సక్సెస్ అయింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ప్రత్యేక చొరవతో తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ఆధ్వర్యంలో శుక్రవారం పుష్ప గ్రాండ్‌లో నిర్వహించిన ఈ జాబ్‌మేళాకు భారీ సంఖ్యలో నిరుద్యోగ యువత తరలివచ్చారు. 142కు పైగా కంపెనీల ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా యువత ప్రాథమికంగా ఎంపికయ్యారు. ఈ మెగా జాబ్‌మేళాకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై వివిధ కంపెనీల స్టాళ్లను పరిశీలించారు. యువతతో మాట్లాడి ఉద్యోగావకాశాలు, కంపెనీల అవసరాలు, ఎంపిక ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ యువత చదువుతోపాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకొని ఉన్నత వేతనాలతో కూడిన ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రారంభంలో రూ.10 వేల నుంచి రూ.20 వేల వేతనంతో ఉద్యోగంలో చేరినా, అనుభవం సంపాదిస్తూ నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటే రూ.50 వేల నుంచి రూ.70 వేల వరకు వేతనం పొందే అవకాశాలుంటాయని



వివరించారు. కేవలం విద్యార్హతలే కాకుండా, పనిలో నైపుణ్యం, క్రమశిక్షణ, నేర్చుకోవాలనే తపన ఉన్నప్పుడే ఉద్యోగాల్లో రాణించడంతోపాటు పదోన్నతులు సాధ్యమవుతాయని స్పష్టం చేశారు. వ్యవసాయం, కూలీ పనులు, చిన్నచిన్న వ్యాపారాలు చేస్తూ తల్లిదండ్రులు తమ పిల్లలను చదివిస్తున్నారని, వారి కష్టాన్ని గుర్తించి యువత ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకొని కుటుంబాలకు అండగా నిలవాలని సూచించారు. ఉద్యోగం కోసం ప్రయత్నించే యువత ప్రాంతీయ పరిమితులకు లోబడి ఉండకుండా, ఎక్కడ మంచి అవకాశం లభించినా అందిపుచ్చుకోవాలని అన్నారు. నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, నైపుణ్యాలను పెంపొందించుకుంటూ కష్టపడి పనిచేస్తే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని భరోసా ఇచ్చారు.

**ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో అవకాశాలు**

యువతకు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందించేందుకు ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీతోపాటు టాస్క్ ద్వారా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ప్రైవేటు సంస్థలతో సమన్వయం చేసుకుంటూ కంపెనీల అవసరాలకు తగిన శిక్షణ అందించి మరింత మందికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ తదితర విద్యార్హతలు కలిగిన యువతకు ఈ తరహా జాబ్‌మేళాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 70 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసినట్లు మంత్రి వివరించారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4 పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తూ అర్హులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూనే ప్రైవేటు రంగంలో లభించే అవకాశాలను కూడా వినియోగించుకోవాలని యువతకు సూచించారు.

**రెండు గంటల్లోనే 600 మందికి పైగా ఎంపిక**

జాబ్‌మేళా ప్రారంభమైన రెండు గంటల్లోనే 600 మందికి పైగా అభ్యర్థులు ప్రాథమికంగా ఎంపిక కావడం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. కొన్ని కంపెనీలు ఒక్కొక్కటి 100 నుంచి 400 మందికి పైగా అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆసక్తి చూపినట్లు తెలిపారు. భూపాలపల్లి వంటి ప్రాంతాల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా స్థానిక నిరుద్యోగ యువతకు కంపెనీల ప్రతినిధులతో నేరుగా మాట్లాడే అవకాశం లభిస్తుందని అన్నారు. జాబ్‌మేళా నిర్వహణకు కృషి చేసిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, జిల్లా యంత్రాంగాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

**భూపాలపల్లి అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ**

భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కృషి చేస్తున్నారని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి, పట్టణంలో రోడ్ల విస్తరణతోపాటు సుమారు రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా స్థానికంగా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

**గత జాబ్‌మేళాలో 2,700 మందికి ఉద్యోగావకాశాలు: ఎమ్మెల్యే**

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. భూపాలపల్లి నిరుద్యోగ యువతకు మెగా జాబ్‌మేళా గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా సుమారు 10 వేల నుంచి 12 వేల వరకు ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గత సంవత్సరం నిర్వహించిన మెగా జాబ్‌మేళా ద్వారా 2,700 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు గుర్తుచేశారు. ఈసారి మరింత ఎక్కువ మంది యువతకు ఉపాధి లభించేలా 142కు పైగా కంపెనీలను ఒకే వేదికపైకి తీసుకువచ్చినట్లు చెప్పారు. టాస్క్ ద్వారా జిల్లాలో నైపుణ్యాభివృద్ధి శిక్షణను మరింత విస్తరించనున్నట్లు వెల్లడించారు. సింగరేణి సంస్థ సహకారంతో శిక్షణ కేంద్రానికి విశాలమైన హాలు, ఏసీ వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గాంధీనగర్ పారిశ్రామిక ప్రాంత అభివృద్ధికి కూడా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధించి తమ కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.

**అర్హతకు తగిన ఉద్యోగాలు సాధించాలి: కలెక్టర్**

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. 142కు పైగా కంపెనీలు మెగా జాబ్‌మేళాలో పాల్గొనడం యువతకు మంచి అవకాశమని తెలిపారు. కంపెనీల ప్రతినిధులు జిల్లా కేంద్రంలోనే ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నందున అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలకు తగిన ఉద్యోగాలను సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు మంత్రి, ఎమ్మెల్యే చేతులమీదుగా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, టాస్క్ సీఈఓ ప్రదీప్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, రాష్ట్ర ఉపాధి హామీ పథకం డైరెక్టర్ దండు రమేష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఉదయ్‌కుమార్, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు, కంపెనీల ప్రతినిధులు, నిరుద్యోగ యువత తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక లారీల అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు

- డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే వాహన యజమానులదే బాధ్యత
- రోడ్డు ప్రమాదాల నియంత్రణలో పోలీసులతో పాటు ప్రజలకు కూడా సమిష్టి బాధ్యత
- వాహనాలను నిర్లక్ష్యంగా నడిపే వారిపై సంబంధిత పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేసేలా వెసులుబాటు
- ప్రజలు సురక్షితంగా ఇంటికి చేరడమే పోలీసులు అంతిమ లక్ష్యం



**ములుగు ప్రతినిధి,అక్టోబర్9(జనం సాక్షి):-** ములుగు జిల్లాలో ఇసుక లారీల ద్వారా జరుగుతున్న అతివేగ ప్రయాణం,నిర్లక్ష్యపు డ్రైవింగ్, రహదారులపై అక్రమ పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ప్రజల ప్రాణ భద్రతకు విఘాతం కలిగించే విధంగా వాహనాలు నడిపినా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా లారీలను నిలిపినా సంబంధిత వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్ తెలియజేశారు.అదేవిధంగా ఇసుక లారీ డ్రైవర్లు నిర్దేశిత వేగ పరిమితులను తప్పనిసరిగా పాటించాలని, నిర్లక్ష్యంగా లేదా ప్రమాదకరంగా వాహనాలు నడపరాదని సూచించారు. ముఖ్యంగా జనావాస ప్రాంతాలు, ప్రధాన రహదారులు, విద్యాసంస్థలు, రద్దీగా ఉండే కూడళ్ల వద్ద అత్యంత అప్రమత్తంగా వాహనాలు నడపాలని ఆదేశించారు.అదేవిధంగా, రహదారులపై,ప్రధాన కూడళ్ల వద్ద, ప్రజలకు మరియు ఇతర వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించే విధంగా ఇసుక లారీలను అక్రమంగా పార్కింగ్ చేయరాదని, వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని సూచించారు.ట్రాఫిక్ నియంత్రణకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అదేవిధంగా ఇసుక లారీల యజమానులు తమ డ్రైవర్లకు రహదారి భద్రతా నిబంధనలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని, డ్రైవర్లు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇచ్చేల చొరవ తీసుకోవాలని సూచించారు. ఇట్టి నిబంధనలను ఉల్లంఘిస్తే ఆయా వాహన డ్రైవర్లతో పాటు యజమానులను కూడా బాధ్యులను చేస్తామని,చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే వాహనాలను చట్ట ప్రకారం సీజ్ చేస్తామని హెచ్చరించారు.డ్రైవర్లు తాగి వాహనాలు నడపకూడదని,మీ నిర్లక్ష్యం వేరొకరి ప్రాణాలకు అపాయం కలిగించకూడదని హెచ్చరించారు. ములుగు జిల్లాలోకి వచ్చి వెళ్లే ప్రతి లారీని తనిఖీ చేయడం జరుగుతుందని డ్రైవర్లు తాగి వాహనాలు నడుపుతూ పట్టుపడితే ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, హెచ్చరించారు. ప్రజలు కూడా ఎవరైనా వ్యక్తులు తాగి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించిన,ఏదైనా వాహనం నిర్లక్ష్యంగా, ప్రజలకు హాని కలిగించేలా నడుపుతున్నట్టు చూసినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ కి లేదా అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.తద్వారా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు.. నిబంధనల ఉల్లంఘనలను అరికట్టేందుకు ములుగు జిల్లాలోనీ సంబంధిత ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించి, డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, అక్రమ పార్కింగ్‌కు పాల్పడే వారిపై వర్తించే చట్టాల ప్రకారం జరిమానాలు విధించడంతో పాటు అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.రహదారి భద్రతను పరిరక్షించడం, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, ప్రమాదాలను నివారించడమే ములుగు జిల్లా పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యం అని, ప్రజల భద్రతకు భంగం కలిగించే ఎలాంటి ఉల్లంఘనలనూ సహించేది లేదని, ఇసుక లారీ యజమానులు, డ్రైవర్లు పోలీస్ శాఖకు సహకరిస్తూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలు కూడా రోడ్డు భద్రతలో పాలుపంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



**నల్లబెల్లి, అక్టోబర్ 09 (జనంసాక్షి):** మండలంలోని మేడేపల్లి, రాంపూర్, ఆసరేల్లి గ్రామాల్లో నూతన యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలను మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పురుషోత్తం సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మేడేపల్లి, రాంపూర్ గ్రామాలకు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా తడక రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్లుగా బొడిగె శివ, కాసు పవన్, ప్రధాన కార్యదర్శిగా రాతిపెల్లి సందీప్, కార్యదర్శిగా జెల్ల రాకేష్, ఉపాధ్యక్షులుగా మార్గం శ్రీకాంత్, జెట్టి సతీష్ ఎన్నికయ్యారు. అలాగే ఆసరేల్లి గ్రామ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పత్యం రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాళ్లపల్లి ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఆకారపు యశ్వంత్, ఉపాధ్యక్షుడిగా తోట నాగరాజు, కార్యదర్శులుగా గౌరబోయిన సందీప్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పురుషోత్తం సురేష్ మాట్లాడుతూ నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధి, యువతకు అవకాశాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో యువజన కాంగ్రెస్ నాయకులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి యువత ముందుండాలని సూచించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి, ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జి, పార్టీ ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో పశువైద్య కేంద్రం

### పెచ్చులూడుతున్న భవనం ఇబ్బందులు పడుతున్న డాక్టర్, సిబ్బంది, రైతులు

### వర్షం పడితే తడుస్తున్న మందులు, వ్యాక్సిన్లు





**నల్లబెల్లి, అక్టోబర్ 8 (జనంసాక్షి):** నల్లబెల్లి మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రం శిథిలావస్థకు చేరుకోవడంతో రైతులు, పశువైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏళ్లుగా భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో పైకప్పు పెచ్చులూడిపడుతోంది. గోడలు బీటలు వారడంతో పాటు వర్షం పడిన సమయంలో పైకప్పు, గోడల నుంచి నీరు లోపలికి వస్తోంది. దీంతో పశువులకు చికిత్స అందించేందుకు వచ్చే రైతులు భయాందోళనకు గురవుతున్నారు.మండలంలోని పలు గ్రామాల నుంచి రైతులు తమ పశువులకు వ్యాధులు సోకినప్పుడు చికిత్స కోసం నల్లబెల్లి పశువైద్య కేంద్రానికి వస్తుంటారు. అయితే కేంద్రంలో కనీస వసతులు లేకపోవడంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. శిథిలావస్థకు చేరిన భవనంలోనే వైద్య సేవలు కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. భవనం ఎప్పుడు కూలుతుందోనన్న ఆందోళన రైతులు, వైద్య సిబ్బందిలో వ్యక్తమవుతోంది.

**వర్షం వస్తే మరింత ఇబ్బంది:**

వర్షాకాలంలో పశువైద్య కేంద్రం పరిస్థితి మరింత దయనీయంగా మారుతోంది. భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు కారడంతో పాటు గోడల నుంచి కూడా నీరు లోపలికి వస్తోంది. దీంతో పశువులకు అందించాల్సిన మందులు, వ్యాక్సిన్లు తడిసిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. వైద్య సేవలకు అవసరమైన సామగ్రిని భద్రపరచడంలో సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.మరోవైపు స్లాబ్ నుంచి తరచూ పెచ్చులు ఊడిపడుతుండటంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనన్న భయం నెలకొంది. వైద్య కేంద్రానికి వచ్చే రైతులు, పశువైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

**నూతన భవనం నిర్మించాలి: రైతు ఓల్లె కొమురయ్య**

పశువులకు వ్యాధులు సోకినప్పుడు చికిత్స కోసం మండల కేంద్రానికి వస్తున్నామని, అయితే ఇక్కడి భవనం పరిస్థితి దారుణంగా ఉండటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రుద్రగూడెంకు చెందిన రైతు ఓల్లే కొమురయ్య తెలిపారు. భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో లోపలికి వెళ్లాలంటేనే భయంగా ఉందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతన పశువైద్య కేంద్ర భవనాన్ని నిర్మించాలని కోరారు.

**మందులు, వ్యాక్సిన్ల భద్రతపై ఆందోళన:మండల పశువైద్యాధికారి వేణు**

భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ వేణు తెలిపారు. వర్షాలు కురిసిన సమయంలో పైకప్పు, గోడల నుంచి నీరు లోపలికి వస్తోందని, దీంతో మందులు, వ్యాక్సిన్లు తడిసిపోయే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడుతున్నాయని తెలిపారు. పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నూతన భవనం నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు.



## పాఠశాలల్లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన విద్యార్థినులు







**మరిపెడ అక్టోబర్ 9 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలల్లో ప్రైవేటు పాఠశాలల్లో బతుకమ్మ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రభుత్వ,ప్రైవేటు ప్రధానోపాధ్యాయులు తెలిపారు. మండల ప్రజా పరిషత్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ వైస్ చైర్మన్ కాలం సునీత రవీందర్ రెడ్డి గారు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు రంగురంగుల పూలతో అందమైన బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులు బతుకమ్మ పాటలు పాడుతూ, సంప్రదాయ ఆటపాటలతో సందడి చేశారు. పూల పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిలో బతుకమ్మకు ఉన్న ప్రత్యేక స్థానాన్ని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించడంతో పాటు, మన పండుగలు, ఆచారాల పట్ల అవగాహన కల్పించడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. పాఠశాలలో నిర్వహించిన ఈ వేడుకలు విద్యార్థినుల్లో ఆనందోత్సాహాలను నింపాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గుగులోత్ మంగీలాల్, లింగాల మహేష్ గౌడ్, వెంకటేశ్వరరావు, సందీప్,కవిత, ఆదిలక్ష్మి, సారిక, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో విద్యార్థులకు
### మెరుగైన వైద్య విద్యను అందించాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 07,(జనంసాక్షి ) ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్య, మౌలిక సదుపాయాల కల్పన, ప్రభుత్వ ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాల కల్పన, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్య విద్యను అభ్యసించే విద్యార్థులకు అవసరమైన ప్రాక్టికల్ శిక్షణ ఇచ్చినప్పుడే వారి సామర్థ్యాలు పెరుగుతాయని, అలాగే వారు మంచి వైద్యులుగా తీర్చిదిద్దబడతారని పేర్కొన్నారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వివరించారు. వైద్య కళాశాలలోని విద్యార్థుల సంఖ్య, వారి విద్యా సంబంధిత విషయాలను అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు నిర్దేశిత పరీక్షలను నిర్వహిస్తూ, విద్యార్థుల అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని ఆయా విభాగాల్లో అవసరమైన వైద్య సేవలను అందించేందుకు కావలసిన పరికరాలన్నీ ప్రాధాన్యత క్రమంలో సమకూర్చుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో డిఎంహెచ్ఓ రాజేందర్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, డిసిహెచ్ఓ కాశీనాథ్, ఇతర అధికారులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధుల ఆశీర్వాదాలే
## మా కుటుంబానికి కొండంత బలం: ఏల మంజులత
### ఐదేళ్లుగా అనాథ వృద్ధులకు అండగా ఏల సుందర్ చారిటబుల్ ట్రస్ట్



**దేవరుప్పుల, అక్టోబర్ 09 (జనం సాక్షి)** ఆదరణకు నోచుకోని వృద్ధులకు అండగా నిలుస్తూ ఏల సుందర్ చారిటబుల్ ట్రస్ట్ గత ఐదేళ్లుగా సేవలందిస్తోంది. దేవరుప్పుల మండలం సీతారాంపురంలోని ప్రేమా సదన్ వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు ప్రతి నెలా రూ.8 వేల నుంచి రూ.10 వేల విలువైన మందులను ఉచితంగా అందిస్తోంది. సేవా కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ట్రస్ట్ చైర్మన్ ఏల సుందర్ సతీమణి ఏల మంజులత వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు మందులు, పండ్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని, వారి ఆశీర్వాదాలే తమ కుటుంబానికి కొండంత బలమని ఏల మంజులత పేర్కొన్నారు. తమకు అండగా నిలుస్తున్న ఏల సుందర్ కుటుంబానికి వృద్ధులు కృతజ్ఞతలు తెలుపుతూ ఆశీర్వదించారు.

## పంచాయతీ సిబ్బందికి పండుగ కానుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 9 (జనం సాక్షి):** బతుకమ్మ, విజయదశమి పండుగలను పురస్కరించుకుని పాత ముగ్దంపురం గ్రామపంచాయతీ సిబ్బందికి సర్పంచ్ ననుమాస కరుణాకర్, ఉపసర్పంచ్ అల్వాల శ్రీనివాస్ నూతన వస్త్రాలను అందజేశారు. శుక్రవారం గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కార్యదర్శి శ్రావణి కుమారితో పాటు సిబ్బందికి వస్త్రాలు అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ పాలనలో సిబ్బంది సేవలు కీలకమని సమన్వయంతో పనిచేస్తూ గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కొయ్యల స్వప్న భాస్కర్, నాంపెల్లి సంపత్, కాట్టూరి లక్ష్మణ చారి, దొనికెల భార్గవ్, జన్ను రమేష్, మదాసి అనిత, షేక్ హసీనా, పంచాయతీ సిబ్బంది కల్వచర్ల సాంబయ్య, నాంపెల్లి కుమారస్వామి, నాంపెల్లి ఐలుమల్లు, మేకల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# బతుకమ్మ.. బతుకమ్మా ఉయ్యాలో....!

- నేటి నుండి గ్రామాల్లో పూల జాతర
- తొమ్మిది రోజులపాటు ఇంటింటా ఆడబిడ్డల సందడి
- నేడు ఎంగిలిపూల బతుకమ్మ సంబరాలు
- 18న సద్దుల బతుకమ్మతో ముగింపు వేడుకలు



**చెన్నారావుపేట, అక్టోబర్ 9 ( జనం సాక్షి ):** తెలంగాణ పల్లె జీవనంలో మమేకమైన బతుకమ్మ పండుగ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుంది. తెలుగింటి ఆడపడుచులు రంగురంగుల తీరొక్క పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి మహిళలు వాటి చుట్టూ తిరుగుతూ ఉయ్యాల పాటలతో ఆడి పాడుతూ సంబరాలు చేసుకుంటారు. బతుకమ్మ పండుగకు గ్రామీణ ప్రాంతాల్లో ఒక ప్రత్యేకత ప్రాధాన్యత ఉంది. కొత్తగా పెళ్లయిన వారు, గ్రామాలలో నుండి ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు పుట్టింటికి చేరుకొని తొమ్మిది రోజులపాటు బతుకమ్మ వేడుకల్లో మమేకమవుతారు. మహిళలు తొమ్మిది రోజులపాటు ఆడే బతుకమ్మ సంబరాలు నేడు శనివారం ఎంగిలిపూల బతుకమ్మతో గ్రామాలు, పట్టణాలు, నగరాలలో ప్రారంభం కానున్నాయి. బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలు తమ పిల్లాపాపలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారు. ప్రకృతి సిద్ధమైన తంగేడు, గునుగు, చామంతి, తామర, గుమ్మడి, సీతమ్మ జడ, బంతి వివిధ రకాల రంగురంగుల పూలను సేకరించి బతుకమ్మలను పేర్చి ఒకచోట చేరుకొని బతుకమ్మ... బతుకమ్మా...ఉయ్యాలో... బంగారు బతుకమ్మ ఉయ్యాలో... అంటూ వలయాకారంగా తిరుగుతూ ఆడి పాడుతారు. తొమ్మిది రోజులపాటు తొమ్మిది రకాల నైవేద్యాలను సమర్పిస్తారు.

**మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మ**

మొదటిరోజు ఎంగిలిపూల బతుకమ్మగా పిలుస్తారు. మొదటి రోజైన అశ్వ యుజ శుద్ధ అమావాస్య నేడు శనివారం శక్తి స్వరూపిణి అయిన గౌరమ్మను ఎంగిలిపూల బతుకమ్మగా మహిళలు ఆరాధిస్తారు. వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మపై గౌరమ్మను ఉంచుతారు. అనంతరం బతుకమ్మలను తీసుకొని మహిళలు సమీప ఆలయాల వద్దకు చేరుకొని ఆడి పాడతారు.

**రెండో రోజు అటుకుల బతుకమ్మ**

రెండవ రోజైన ఆదివారం అటుకుల బతుకమ్మగా పిలుస్తారు. ఈరోజు ప్రధానంగా నివేదించేవి అటుకులు కాబట్టి అటుకుల బతుకమ్మగా పిలుచుకుంటారు. వివిధ రకాల పూలతో రెండు ఎత్తులలో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పైన గౌరమ్మను ఉంచి ఆడి పాడుతారు.

**మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ**

సోమవారం మూడోరోజు బతుకమ్మను ముద్దపప్పు బతుకమ్మగా పిలుస్తారు. మూడు ఎత్తులలో పూలతో బతుకమ్మలను పేర్చి పైన గౌరమ్మను ఉంచుతారు. అనంతరం ఆడిపాడతారు. ప్రధానంగా ముద్దపప్పును నివేదిస్తారు. కాబట్టి ముద్దపప్పు బతుకమ్మగా పిలుచుకుంటారు.



**నాలుగో రోజు నానె బియ్యం బతకమ్మ**

మంగళవారం నాలుగో రోజు నానె బియ్యం బతుకమ్మగా పిలుస్తారు. నానపోసిన బియ్యాన్ని గౌరమ్మకు నివేదిస్తారు. కాబట్టి నానె బియ్యం బతుకమ్మగా పిలుచుకుంటారు. నాలుగు ఎత్తుల్లో పూలతో బతుకమ్మను పేర్చి పైన గౌరమ్మను ఉంచి ఆడి పడతారు.

**ఐదో రోజు అట్ల బతుకమ్మ**

బుధవారం ఐదో రోజు అట్ల బతుకమ్మగా పిలుస్తారు. బియ్యాన్ని నానబెట్టి దంచి చేసిన అట్లను గౌరమ్మకు నివేదిస్తారు. అందుకే అట్ల బతుకమ్మగా పిలుచుకుంటారు. వివిధ రకాల పూలతో ఐదు ఎత్తుల్లో బతుకమ్మను పేర్చి పైన గౌరమ్మను నుంచి ఆడిపాడతారు.

**ఆరో రోజు అలిగిన బతుకమ్మ**

గురువారం ఆరో రోజు అలిగిన బతుకమ్మ గా పిలుచుకుంటారు. పూర్వకాలంలో బతుకమ్మలను పేర్చే సమయంలో మాంసం ముద్ద తగిలి అపచారం జరిగిందట. అందుకని ఆరో రోజు బతుకమ్మ అలిగి ఏది తినదంట. కాబట్టి బతుకమ్మ అలకతీరాలని మహిళలు ప్రార్థిస్తారు. ఈరోజు పూలతో బతుకమ్మను తయారు చేయరు.

**ఏడో రోజు వేపకాయల బతుకమ్మ**

శుక్రవారం ఏడో రోజు వేపకాయల బతుకమ్మగా పిలుచుకుంటారు. బియ్యం పిండిని వేయించి అందులో బెల్లం కలిపి వేపకాయ ఆకారంలో చేసిన పిండి వంటను గౌరమ్మకు నివేదిస్తారు. కాబట్టి వేపకాయల బతుకమ్మగా పిలుస్తారు. వివిధ రకాల పూలతో ఏడు ఎత్తుల్లో బతుకమ్మను పేర్చి పైన గౌరవం ఉంచి ఆడిపాడతారు.

**ఎనిమిదో రోజు వెన్నెముద్దల బతుకమ్మ**

శనివారం ఎనిమిదవ రోజు వెన్నెముద్దల బతుకమ్మగా పిలుస్తారు. వెన్నతో తయారు చేసిన ముద్దలను గౌరమ్మకు నివేదిస్తారు. అందుకే వెన్నెముద్దల బతుకమ్మ అని పిలుచుకుంటారు. ఎనిమిది ఎతుల్లో వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి పైన గౌరవం ఉంచి ఆడిపాడతారు.

**తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ**

ఆదివారం తొమ్మిదవ రోజు సద్దుల బతుకమ్మగా పిలుస్తారు. బతుకమ్మ వేడుకల్లో చివరి రోజు అయిన తొమ్మిదవ రోజున పెద్ద ఎత్తున బతుకమ్మలను పేర్చుతారు. పైన గౌరమ్మలను ఉంచి మహిళలంతా కలిసి చెరువుల సమీపం వద్దకు వెళ్లి ఒకే చోట బతుకమ్మ పాటలను పాడుతూ ఆడతారు. అనంతరం మహిళలు ఒకరికొకరు వాయినాలు ఇచ్చుకొని తదనంతరం బతుకమ్మలను చెరువుల్లో నిమజ్జనం చేస్తారు. దీంతో బతుకమ్మ సంబరాలు ముగుస్తాయి.

# లక్ష్యసాధనతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి
### ఫ్రెషర్స్ డే వేడుకల్లో జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశురాం

**దిలావర్‌పూర్, అక్టోబర్ 09, (జనం సాక్షి):** ప్రతి విద్యార్థి భవిష్యత్తుపై స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ పరశు రాం సూచించారు. లక్ష్యంలేని ప్రయాణం గమ్యాన్ని చేరుకోలేదని, విద్యార్థి దశలోనే భవిష్యత్తు ప్రణాళికపై స్పష్టత కలిగి ఉండాలని పేర్కొన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి పూర్తి చేసుకుని ఇంటర్మీడియట్‌లోకి అడుగుపెట్టిన విద్యార్థులకు ఈ దశ ఎంతో కీలకమని, కళాశాల జీవితం వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్తు లక్ష్యాల సాధనకు పునాది వేస్తుందని తెలిపారు. ఈ క్రమంలో మంచి స్నేహితులను ఎంచుకోవాలని, స్నేహితుల ప్రభావం భవిష్యత్తుపై ఉంటుందని పేర్కొన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ పి. సుదర్శన్ మాట్లాడుతూ విద్యార్థులు సమయపాలన పాటిస్తూ తరగతులకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. మధ్యతరగతి తల్లిదండ్రులపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వ కళాశాలలో అందుబాటులో ఉన్న



ఆధునిక సాంకేతిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఏఐ ఆధారిత డిజిటల్ తరగతుల ద్వారా నాణ్యమైన విద్యను అభ్యసించి, తమ లక్ష్యాలను సాధించాలని కోరారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నిర్మల్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ తుకారాం, కళాశాల ఏజీఎంసీ రామారావు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతన్నకు నడక నేర్పిన వ్యవసాయ అధికారి పూర్ణిమ

- మండలంలో పనిచేస్తున్న ఏఈవోలు అధిక తోడ్పాటు
- గతంలో కంటే ఘనమైన దిగుబడులు తీస్తున్న రైతన్నలు
- అధికారుల సూచనలతో మారిన సాగు విధానం.. కళకళలాడుతున్న వరి, పత్తి చేలు





**కాటారం అక్టోబర్ 9 (జనం సాక్షి. )** కాటారం మండల పరిధిలో పనిచేస్తున్న వ్యవసాయ అధికారులు ఏవోలు, ఏఈవోలు రైతులకు వ్యవసాయంపై తగిన సూచనలు చేస్తూ ముందుకు నడిపిస్తున్నారు. ఈ సంవత్సరం జూన్ మొదటి వారంలోనే వరి నారు పోసుకునేలా రైతులను ప్రోత్సహించడంతో ప్రస్తుతం వరి పంట పూత దశకు చేరుకుంది. పత్తిని కూడా జూన్ మాసంలోనే సాగు చేయడంతో సమృద్ధిగా, ఏపుగా పెరిగింది. వర్షాలు కూడా అనుకూలంగా కురవడంతో పంటలు ఆశాజనకంగా ఉన్నాయి. కాటారం మండలం పరిధిలో పత్తి పంట చింతకాని అంకుసాపూర్ ములుగు పల్లి కొత్తపల్లి ప్రతాప్ గిరి పడుకులవంచ జాతరవ్ పేట్ ధన్వాడ రేకులగూడెం ఈ గ్రామాల్లో అధికంగా పత్తి పంట పండిస్తున్నారు. వరి పంట రేగుల గూడెం గంగారం విలాసాగర్ దామరకుంట మానేరు ప్రతి ప్రాంతంలో నీరు సమృద్ధిగా ఉండి వరిపైన పంటపైన మక్కువ చూపుతున్నారు .చౌక భూములు నీరు ఉండడం వలన వరి పంట అధికంగా పండి ఈ ప్రాంత రైతులు చాలా ఉన్నత స్థాయికి ఎదిగారు . పురాతన నుంచి కూడా మానేరు గోదావరి రైతులకు ఎంతో ఉపకరించింది . మండలంలో వరి పంట 12275 ఎకరాలు వేసినట్లు అధికారులు చెప్తున్నారు . పత్తి పంట 14 8 25,కూరగాయలు 125 ,పండిస్తున్న ఎకరాలు పండిస్తున్నారు. పత్తి సాగుకు ఎండాకాలంలోనే దుక్కు దున్ని చదును చేసి జూన్ మాసంలోనే విత్తనం నాటారు. ఎద్దు నాగలితో భూమిని దున్ని గడ్డి లేకుండా సిద్ధం చేసుకున్నారు. అనంతరం రైతు కూలీలతో కలుపు లేకుండా పత్తి చేన్లను నీట్‌గా నిర్వహిస్తున్నారు. దీంతో ఈ సంవత్సరం పత్తి పంట ఎలాంటి ఆకుమచ్చ వంటి సమస్యలు లేకుండా ఆరోగ్యంగా పెరుగుతోంది. గత సంవత్సరాల్లో వరి పంటకు యూరియాను అధికంగా వినియోగించడం వల్ల పంట ఏపుగా పెరిగినప్పటికీ అనేక రకాల రోగాల బారిన పడేదని రైతులు చెబుతున్నారు. ఈ సంవత్సరం వ్యవసాయ అధికారులు నిబద్ధతతో రైతులకు సూచనలు చేయడంతో రైతులు సాగులో మెళకువలు పాటిస్తున్నారు. గత రెండు సంవత్సరాలుగా వరి, పత్తి పంటల్లో దిగుబడులు ఘనంగానే వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

**ఎకరాకు 40 బస్తాల దిగుబడి వస్తుందని ఆశలు**

ప్రస్తుతం వరి పొలాలు, పత్తి చేన్లు ఎంతో నీట్‌గా కనిపిస్తున్నాయి. వరి పంట ఎకరాకు 40 బస్తాల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉందని రైతులు ఆశిస్తున్నారు. పత్తి పంటలో కూడా పూత బాగా ఉండటంతో మంచి దిగుబడి వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. అయితే ఎండలు అధికంగా ఉండటంతో వరి పొలాలకు నీటి సమస్య తలెత్తింది . కరెంటు సరిగా రాకపోవడం పొలాలు పొట్ట దశలో ఉండి కొన్ని పొలాలు పూస దశలో ఉన్నాయి . ఒక్క నెల పాటు కరెంటు సహకరిస్తే ఈ సంవత్సరం రైతు గట్టినట్లేనని రైతుల ఆరోపిస్తున్నారు. వ్యవసాయ అధికారి పూర్ణిమ సూచనలు తెలియజేస్తూ ఈ సంవత్సరం వరి పత్తి కూరగాయలు అన్ని పంటలు సజావుగా పెరిగినాయి. అని ఎలాంటి చీడపురుగులు ఆశించకుండా ఎక్కువ శాతం రైతు పిచికారి చేయకుండా పత్తి పొలము రైతులు కాపాడుకున్నారని ఆమె తెలిపారు . పత్తికి ఎండలు ఎక్కువ రైతులు దిగులు పడుతూ ఎండిపోతాయని అంటున్నారు. కానీ నవంబర్ ఫస్ట్ వీక్ లో రేగడి భూములకు ఒక తడి పెడితే సరిపోతుంది. అని అంతగా ఆందోళన అవసరం లేదని ఆమె తెలిపారు. వరి పంట కూడా ఒక రెండు తడులు భూమిపై పారితే సరిపోతుందని తెలిపారు. ఉదయం పూట మంచు అధికంగానే పడుతుందని దీనివలన కొంచెం తేమ శాతం పెరుగుతుందని ఆమె తెలిపారు. ఎలాంటి ఆందోళన గురి కావద్దన రైతులకు సూచనలు ఇచ్చారు.

# యునైటెడ్ నేషన్స్ అవార్డుకు ఉపాధ్యాయురాలు రమాదేవి ఎంపిక

## అభినందించిన ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ, ఉపాధ్యాయులు




**చెన్నారావుపేట, అక్టోబర్ 9 ( జనం సాక్షి):** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయురాలు బి.రమాదేవి తెలంగాణ రిసోర్స్ సెంటర్ ఫర్ యునైటెడ్ నేషన్స్ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవంను పురస్కరించుకుని ఈ నెల 5న వరంగల్‌లో ఏకశిల క్లబ్ ఫర్ యునెస్కో ఆధ్వర్యంలో రాష్ట్రాల వారిగా ఉత్తమ ఉపాధ్యాయులకు జ్యూరీ కమిటీ అవార్డులు ప్రకటించారు. తెలంగాణ రాష్ట్రం నుండి విధినిర్వహణలో అత్యుత్తమ సేవలు అందించినందుకు, ఉప్పరపల్లి ఉన్నత పాఠశాలలో కిచెన్ గార్డెన్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినందుకు, హిందీ భాషాభివృద్ధికి కృషి చేస్తున్నందుకు విద్యార్థుల అభివృద్ధి కొరకు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నందుకు ఈ అవార్డు ప్రకటించారు. యునైటెడ్ నేషన్స్ రిసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అశ్వినీశర్మ, తెలంగాణ రిసోర్స్ సెంటర్ కోఆర్డినేటర్ డి.రాజగోవింద్, ఆంధ్రప్రదేశ్ కోఆర్డినేటర్‌లు రామనాథం, పి. రామేశ్వరరావు, యునెస్కో క్లబ్ డైరెక్టర్ దాసరి రామస్వామి, ఉల్లాస్ జిల్లా కో ఆర్డినేటర్ సిహెచ్ నాగేశ్వరరావులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తేజావత్ జయ, ఉపాధ్యాయులు సునీత, రాగి శశిధర్, సంతోష్ కుమార్, పిన్నింటి బాలాజీ రావు, ఎల్ మొగిలి, జి సుందర్, సతీష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్న, హంస రామకృష్ణ, జూనియర్ అసిస్టెంట్ జాహేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిరలు అభినందించారు.

# నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

## దసరా, బతుకమ్మకు పటిష్ట భద్రత: ఎస్పీ జానకి షర్మిల




**నిర్మల్ బ్యూరో , అక్టోబరు 9:( జనంసాక్షి )** ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్పీ డా. జి. జానకి షర్మిల పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పెండింగ్ కేసుల పరిష్కారం, నేరాల నియంత్రణ, దర్యాప్తు పురోగతిపై సమీక్షించారు. నేరాల వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించాలని, ఎలక్ట్రానిక్ సాక్ష్యాల సేకరణ, ఘటనాస్థలంలోనే వివరాల నమోదు, జీరో ఎఫ్ఐఆర్ విధానాలను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. దసరా, బతుకమ్మ పండుగల సందర్భంగా పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేయాలని, గంజాయి అక్రమ రవాణా, అంతర్జాల మోసాలు, ఆస్తి నేరాల నియంత్రణకు నిఘా పెంచాలని ఆదేశించారు. రాత్రి గస్తీ ముమ్మరం చేయడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని తెలిపారు. అంతర్జాల మోసాల బాధితులు వెంటనే 1930 సహాయ నంబరును సంప్రదించాలని సూచించారు. అనంతరం సాయుధ రిజర్వు పోలీసు ప్రధాన కార్యాలయంలో పోలీసు వాహనాలను తనిఖీ చేసి, వాటిని ఎల్లప్పుడూ విధులకు సిద్ధంగా ఉంచాలని అధికారులకు సూచించారు. సమావేశంలో భైంసా అదనపు ఎస్పీ సాయికిరణ్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# ఈ-వ్యర్థాలను శాస్త్రీయంగా తొలగించాలి

## మందమర్రి ఏరియా జీ.ఎం. ఎన్. రాధాకృష్ణ




**రామకృష్ణాపూర్, అక్టోబర్ 09(జనంసాక్షి):** సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక స్వచ్ఛత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియా జీ.ఎం. కార్యాలయంలో ఈ-వ్యర్థాల సేకరణ, తొలగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏరియా జీఎం ఎన్. రాధాకృష్ణ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి, నిరుపయోగంగా ఉన్న ఎలక్ట్రానిక్ పరికరాలను ప్రత్యేక డబ్బాలో వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కంప్యూటర్లు, మానిటర్లు, కీబోర్డులు, మొబైల్ ఫోన్లు, వైర్లు తదితర ఈ-వ్యర్థాలను సాధారణ చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, శాస్త్రీయ పద్ధతిలో తొలగించాలని సూచించారు. ఈ-వ్యర్థాల వల్ల భూగర్భ, వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యతగా సహకరించాలని పిలుపునిచ్చారు. కార్యాలయాలు, గనులను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఈ-వ్యర్థాల నిర్వహణపై ఉద్యోగులు, అధికారులు అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జీఎం టు ఎస్‌వో జి.ఎల్. ప్రసాద్, డీజీఎం (పర్సనల్) సీహెచ్. అశోక్, ఏరియా ఈ అండ్ ఎం ఏజీఎం బాలాజీ భగవతీ జా, ఏజీఎం (ఎఫ్ అండ్ ఏ) ఆర్.వి.ఎస్.ఆర్.కే. ప్రసాద్, డీజీఎం (సర్వే) బుఖ్యా దేశాయి, ఐటీ డిప్యూటీ మేనేజర్ రవి, పర్చేస్ అధికారి బాబు, ఏరియా అటవీ శాఖ అధికారి నవీన్, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**రామకృష్ణాపూర్, అక్టోబర్ 09(జనంసాక్షి):** స్థానిక సెయింట్ జోసెఫ్స్ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని విద్యార్థినులు, ఉపాధ్యాయులు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. అనంతరం విద్యార్థినులు, ఉపాధ్యాయులు కలిసి చప్పట్లు కొడుతూ, కోలాటాలు ఆడుతూ బతుకమ్మ పాటలతో సందడి చేశారు. సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకలతో పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహనను పెంపొందించేలా సాగింది.

## షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుల పర్యటనకు అన్ని వివరాలు సిద్ధం చేయాలి:కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు జాతోత్ హుస్సేన్ నాయక్ ఈ నెల 13న జిల్లాలో పర్యటించనున్నందున అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. శుక్రవారం అన్ని శాఖల అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్ లో కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన వివరాల కోసం సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని, ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమాచారాన్ని సిద్ధం చేయాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమ శాఖల సమాచారాన్ని వీలైనంత త్వరగా జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి సమర్పించాలని, వివిధ శాఖల నుంచి అందిన సమాచారాన్ని క్రోడీకరించి జిల్లా స్థాయి సమగ్ర నివేదికను రూపొందించాలని గిరిజన సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. కమిషన్ సభ్యుల పర్యటన అంశం అత్యంత ప్రాధాన్యతతో కూడుకున్నదని, అధికారులు అత్యవసరంగా పరిగణించి నిర్ణీత సమయంలో సమాచారాన్ని అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ టెలికాన్ఫరెన్స్ లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, ఏఎస్పీ నరేష్ కుమార్, ఆర్డీఓ హరికృష్ణ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

## స్టేషన్ ఘన్పూర్‌లో చేగువేరా 59వ వర్ధంతి

### ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఘన నివాళి




**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 09 ( జనం సాక్షి ) :** విప్లవ వీరుడు, ప్రపంచ యువతకు స్ఫూర్తిప్రదాత ఎర్నెస్టో చేగువేరా వర్ధంతిని స్టేషన్ ఘన్పూర్ పట్టణ కేంద్రంలో ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లాకమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగువేరా చిత్రపటానికి ఏఐ ఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మహమ్మద్ యూనుస్, ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు పొదల లవకుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జనగామ జిల్లాకార్యదర్శి యూనుస్,ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా అధ్యక్షుడు లవకుమార్ మాట్లాడుతూ చేగువేరా తన జీవితాన్ని పేదలు,కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడటానికి అంకితం చేశారని పేర్కొన్నారు. సామాజిక అసమానతలు, దోపిడీ, అన్యాయానికి వ్యతిరేకంగా ఆయన సాగించిన పోరాటం నేటి యువతకు ఆదర్శమని అన్నారు.విద్యార్థులు,యువత చేగువేరా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య హక్కుల సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం, నాణ్యమైన విద్య అందరికీ అందుబాటులో ఉండేలా చూడటం, విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తాయని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయి, కిరణ్,రాజు, కార్తీక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు గొడుగు రమేష్, ఎస్ఎఫ్ఐ ఘనపూర్ మండల అధ్యక్ష,కార్యదర్శిలు అంజి, సాయి తేజ మండల కమిటీ సభ్యుడు జశ్వంత్ విద్యార్థు లు పాల్గొన్నారు.

## 29వ సారి రక్త దానం చేసిన పోలేపల్లి రంజిత్ రెడ్డి

### అభినందించిన పలువురు అధికారులు, ప్రజలు




**స్టేషన్ ఘన్పూర్, అక్టోబర్ 09 ( జనం సాక్షి ) :**చిల్పూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పోలేపల్లి రంజిత్ రెడ్డి తన జన్మదినం సందర్భంగా శుక్రవా రం హనుమకొండలోని లోని రెడ్ క్రాస్ సొసైటీలో రక్త దానం చేయడం జరిగింది . ఈ సందర్భంగా పోలేపల్లి రంజిత్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి పుట్టిన రోజుకు రక్తదానం చేయడం జరుగుతుందని, ఇది 29 వ సారి రక్త దానం చేయడం అని అన్నారు. పుట్టినరోజు సందర్భంగా కేకులు కట్ చేసి, స్వీట్లు పంచడం కన్నా ప్రతి ఒక్కరు రక్తదానం చేస్తే ఎందరివో ప్రాణాలు కాపాడిన వారం అవుతామని అన్నారు. మనం చేసే రక్తదానం వాళ్ళ ఒక్కరి ప్రాణాలు కాపాడిన ఎంతో సంతోషం అన్నారు. ఈ సందర్భంగా 29వ సారి రక్తదానం చేసిన పోలే పల్లి రంజిత్ రెడ్డిని అధికారులు, నాయకులు, ప్రజలు అభినందించారు.

## బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

### శ్రీ వివేకవర్ధిని పాఠశాలల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు కరస్పాండెంట్ చిర్ర యా కాంతం గౌడ్





**కేసముద్రం అక్టోబర్ 9 (జనం సాక్షి ):** బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని కరస్పాండెంట్ చిర్రాయకాంతం గౌడ్ అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్‌తో పాటు మహమ్మద్‌పట్నం శివారులోని శ్రీ వివేకవర్ధిని రెసిడెన్షియల్ క్యాంపస్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మలను తీసుకొచ్చారు. ఆటపాటలు, కోలాటాలు, సంప్రదాయ నృత్యాలతో పాఠశాల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. విద్యార్థుల ఉత్సాహం, పూల బతుకమ్మల అందాలతో వేడుకలు కన్నులపండువగా సాగాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధించడం, పూలను పూజించడం, చెరువులు, నీటి వనరుల ప్రాధాన్యాన్ని గుర్తించడం ఈ పండుగలోని అంతరార్థమని వివరించారు. తొమ్మిది రోజులపాటు నిర్వహించే బతుకమ్మ వేడుకల్లో ప్రతిరోజూ ప్రత్యేకమైన నైవేద్యాలు, ఆచారాలు ఉంటాయని, ప్రతి ఆచారం వెనుక ఆరోగ్యం,ప్రకృతి పరిరక్షణ,సామాజిక ఐక్యతకు సంబంధించిన విశిష్టత ఉందని తెలిపారు. మహిళలు,యువతులు, చిన్నారులు కలిసి బతుకమ్మ చుట్టూ ఆడిపాడటం మన సంస్కృతిలోని ఐకమత్యానికి నిదర్శనమన్నారు.ఇలాంటి పండుగల ద్వారా విద్యార్థులకు మన సంస్కృతి,సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంతోపాటు వాటిని భావితరాలకు అందించవచ్చని అన్నారు.అనంతరం రెండు క్యాంపస్‌లలో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బతుకమ్మ సంబరాలు, రావణ దహన కార్యక్రమంతో పాఠశాల ప్రాంగణాలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొనడంతో వేడుకలు విజయవంతంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టు వదలని విక్రమార్కుడీల గ్రామానికి సేవలు

- గూడూరులో 'కోతులు లేని గ్రామంగా' తీర్చిదిద్దడమే మా లక్ష్యం
- గ్రామంలో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలి
- సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్ములు నాయక్



**గూడూరు,అక్టోబర్09(జనంసాక్షి):** గూడూరు గ్రామ ప్రజలకు కోతుల బెడద నుంచి శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామ పంచాయతీ పాలకవర్గం నడుం బిగించిందని గ్రామ సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్ములు నాయక్ అన్నారు.గత కొంత కాలంగా గ్రామంలో కోతుల బెడద విపరీతంగా పెరిగి, కొంత మందిని కరిచయని తన దృష్టికి తీసుకురాగా పాలకవర్గం ప్రత్యేక చొరవ తీసుకుని, గ్రామంలోని కోతులన్నింటినీ పట్టించేందుకు ప్రత్యేక ముఠాలను రంగంలోకి దింపారు. గ్రామంలో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోవడంతో ఇళ్లపైకి రావడం, తినుబండారాలను ఎత్తుకెళ్లడం, స్థానిక ప్రజలపై, ముఖ్యంగా వృద్ధులు, పిల్లలపై దాడులకు తెగబడుతుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సమస్యను తీవ్రంగా పరిగణించిన సర్పంచ్ , ప్రజల రక్షణే ధ్యేయంగా కోతులను సురక్షితంగా పట్టుకుని, అటవీ ప్రాంత తరలింపు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో సర్పంచ్ వాంకుడోత్ సునీత కొమ్ములు నాయక్ మాట్లాడుతూ సుమారుగా 250కోతులను పట్టించి బోనులో వేశామని, "గూడూరు గ్రామ ప్రజల సంక్షేమం, రక్షణే మా మొదటి ప్రాధాన్యతని, గ్రామంలో కోతుల బెడద తీవ్రంగా ఉందన్న విషయాన్ని గుర్తించి, తక్షణమే ఈ చర్యలు చేపట్టామని అనుభవజ్ఞులైన సిబ్బందితో కోతులను పట్టుకుని, వాటికి ఎలాంటి హాని కలగకుండా సుదూర అటవీ ప్రాంతాలకు తరలిస్తున్నామని, గూడూరును త్వరలోనే 'కోతులు లేని గ్రామంగా' తీర్చిదిద్ది, ప్రజలు ప్రశాంతంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామ ప్రజలందరూ సహకరిస్తేనే గ్రామాభివృద్ధి జరుగుతుందని, పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో గూడూరు మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బీరం శ్రీపాల్ రెడ్డి, గూడూరు ఉపసర్పంచ్ చంటి స్వామి, జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి ఎండి రసూల్,వార్డు సభ్యులు మెంబర్లు ఇనుముల ఏకాంబరం, వాంకుడోత్ శ్రీనివాస్, చిరబోయిన కుమార్,పత్తేం వెంకన్న, గార్లపాటి శిరీష రాజేష్,గోనె శిరీష శోభన్ బాబు, వాంకుడోత్ భద్రమ్మ మాలోతు వినోద్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పంజరబోయిన శ్రీనివాస్, గంగయ్య,గ్రామ పెద్దలు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ పాఠశాలలో ఘనంగా ప్రీ-బతుకమ్మ వేడుకలు



**నల్లబెల్లి,అక్టోబరు 09(జనంసాక్షి):** మండలంలోని కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ హైస్కూల్‌లో గురువారం ప్రీ-బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ దుస్తుల్లో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, పూల బతుకమ్మల చుట్టూ నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కమలాకర్ రావు మాట్లాడుతూ.... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను, ప్రకృతి పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. బతుకమ్మ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతితో మనిషికి ఉన్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని, వాటిని భావితరాలకు అందించాలని ఆకాంక్షించారు. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి గర్వకారణమని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యత, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యమివ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.రామారావు, గాదె రాజిరెడ్డి, ప్రిన్సిపాల్ జి. రణధీర్ రెడ్డి, బి. శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

### తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి



**బెల్లంపల్లి, అక్టోబర్ 9 (జనం సాక్షి)** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉదయం పూట పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి తోడ్పడటమే తెలంగాణ అల్పాహార కార్యక్రమం ప్రధాన లక్ష్యమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని శుక్రవారం బెల్లంపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆయన ప్రారంభించారు. హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉదయం పూట అల్పాహారం తీసుకోవడం వల్ల విద్యార్థులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడకుండా, పౌష్టికాహారం తీసుకుంటూ విద్యలో రాణించేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ఉదయాన్నే పనులకు వెళ్లే పరిస్థితుల్లో పాఠశాలల్లోనే అల్పాహారం అందించడం విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనతో పాటు విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి కూడా చదువుకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని, భవిష్యత్తులో తమ కుటుంబాలకు, బెల్లంపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు పెరగడంతో పాటు చదువుపై ఆసక్తి, ఏకాగ్రత పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి, అందుబాటులో ఉన్న విద్యా సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చంద్రయ్య, బెల్లంపల్లి ఎంఈఓ, మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, స్థానిక కౌన్సిలర్ జంగం కల్పన, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు, విద్యార్థులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ క్రాంతి పథకంతో పత్తి రైతులకు ప్రయోజనం

### సబ్సిడీపై పురుగుమందులు, పెరుగుదల నిరోధక మందుల పంపిణీ



**బెల్లంపల్లి, అక్టోబర్ 9 (జనం సాక్షి)** కపాస్ క్రాంతి పథకంలో భాగంగా రైతులకు సబ్సిడీపై పురుగుమందులు, పెరుగుదల నిరోధక మందులను వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. గురజాల రైతు వేదికలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కపాస్ క్రాంతి పథకం ద్వారా రైతులకు కేవలం ఒక్క రూపాయికే పత్తి విత్తనాల ప్యాకెట్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ విత్తనాలతో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేపట్టాలని సూచించారు. ఈ విధానంలో సాగు చేస్తున్న రైతులకు పెరుగుదల నిరోధక మందు చమత్కార్, కాయ తొలుచు పురుగుల నివారణకు ఉపయోగించే క్లోరాంట్రానిలిప్రోల్ మందులను సబ్సిడీపై పంపిణీ చేసినట్లు వివరించారు. బెల్లంపల్లి మండల వ్యవసాయ అధికారి సుద్దాల ప్రేమ్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పత్తి పంటలో రైతులు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను వివరించారు. పంటను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. చంద్రవెల్లి సహకార సంఘం చైర్మన్ చింతం స్వామి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటిస్తూ రాయితీపై అందించే విత్తనాలు, పురుగుమందులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి చి. తిరుపతితో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి, అక్టోబర్ 9 (జనం సాక్షి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ అల్పాహార కార్యక్రమాన్ని హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఆయన ప్రారంభించారు. అనంతరం కళాశాల విద్యార్థినులతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని సందడి చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ముందస్తుగా విజయదశమి, సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, వాటిని భావితరాలకు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాల కో-ఎడ్యుకేషన్‌లో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి బతుకమ్మ ఆడుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు బండి ప్రభాకర్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రత్నం సుకుమారి, వైస్ చైర్మన్ రవి పంతులు,



అధ్యాపకులు, విద్యార్థులు, మాజీ ప్రజాప్రతినిధులు, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఆదర్శ్ వర్ధన్, ఎన్ఎస్‌యూఐ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఇండియా కూటమి

# నిరసన ర్యాలీని విజయవంతం చేయాలి

### శ్రీహరి రావు



**నిర్మల్ టౌన్,అక్టోబర్ 09,(జనంసాక్షి )** నిర్మల్ జిల్లా కేంద్రంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇంచార్జి కూచాడి శ్రీహరి రావు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం చేపడుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉందని ఆరోపించారు. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. స్థానిక మినీ ట్యాంక్ బండ్ అంబేద్కర్ చౌక్ నుండి ఉదయం 11 గంటలకు ర్యాలీ ప్రారంభమై ఆర్డీవో కార్యాలయం వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ నిరసన పాదయాత్ర ర్యాలీలో ఇండియా కూటమి నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### హౌసింగ్ ఏఈ నాగార్జున హెచ్చరిక



**సారంగాపూర్, అక్టోబర్ 9 (జనం సాక్షి)** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం నూతనంగా నిర్దేశించిన నిబంధన ను కచ్చితంగా పాటించాలని వాటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హౌసింగ్ ఏఈ నాగార్జున అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ మార్గదర్శకాలను సంబంధించి ప్రభుత్వం జిఓ 352 ను విడుదల చేసిందని ఆయన తెలిపారు. జియో నిబంధన ప్రకారం ఇంటి పునాది విస్తీర్ణం 400 నుండి 600 చదరపు అడుగుల లోపే ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలతో పాటు ప్రభుత్వం అందించే 5 లక్షల ఆర్థిక సాయం (సబ్సిడీ) తక్షణమే నిలిపివేస్తామని స్పష్టం చేశారు. లబ్ధిదారుల మరిన్ని వివరాల కోసం స్థానిక హౌసింగ్ కార్యాలయంలో గాని పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు.

# అరవింద పబ్లిక్ స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు



**వరంగల్ ఈస్ట్, అక్టోబర్ 09 (జనం సాక్షి )** బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేటలో గల అరవింద పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయినీలు, విద్యార్థులు శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయ దుస్తులతో ముస్తాబై వచ్చిన విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి వాటిని ఒక చోట ఉంచి వాటి చుట్టూ చేరి ఆనందంగా చప్పట్లు, కోలలతో పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ పాఠశాలలో పండుగ వాతావరణాన్ని తలపించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరై బతుకమ్మ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ అంటే పూల పండుగ, ప్రకృతి పండుగ, ఆడపడుచుల ఆత్మీయతకు ప్రతీక అని అన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానంలో బతుకమ్మకు ఒక ప్రత్యేకమైన స్థానం ఉందని, మహిళలు ఈ పండుగను ఎంతో వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. బతుకమ్మ పండుగ మనకు ప్రకృతిని ప్రేమించడం, పూలను గౌరవించడం, మన సంప్రదాయాలను కాపాడుకోవడం వంటి గొప్ప సందేశాలను అందిస్తుంది. మన తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవి వాటిని మన తర్వాతి తరాలైన విద్యార్థులకు ప్రత్యక్షంగా తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ బతుకమ్మ వేడుకలు మనందరి జీవితాల్లో ఆనందాన్ని, ఐక్యతను, సంతోషాన్ని నింపాలని కోరుకుంటూ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థిని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న ఏరియా జీఎం




**శ్రీరాంపూర్(జనంసాక్షి):** ఏరియాలోని ప్రగతి స్టేడియం, సీఈఆర్ క్లబ్ ప్రాంగణంలో శుక్రవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఏరియా సింగరేణి జీఎం శ్రీనివాస్ పాల్గొని ప్లాస్టిక్ వ్యర్థాలు, పేపర్లు, పేరుకుపోయిన చెత్తను ఏరియా అధికారులు, ఉద్యోగులతో కలిసి శుభ్రంచేశారు. జీఎం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు, మినిస్ట్రీ ఆఫ్ కోల్ సూచనల మేరకు సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛత కార్యక్రమం లో భాగంగా స్పెషల్ క్యాంపెయిన్ 6 కొనసాగుతోంది. శ్రీరాంపూర్ లోని అన్ని కార్యాలయాలు, గనులలో నిత్యం ఈవేస్ట్ కలెక్షన్ క్యాంపెయిన్తో పాటు పరిసరాల పరిశుభ్రత నిర్వహిస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతఅని, భావితరాలకు మంచి వాతావరణాన్ని అందిచాలి అంటే ప్లాస్టిక్ నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, ఈవేస్ట్ డిస్పోజల్ పాటించాలి అని సూచించారు. ఆక్టోబర్ 31 నాటికి శ్రీరాంపూర్ ఏరియాలోని అన్ని కార్యాలయాలు, గనులు పర్యావరణ హితంగా సిద్ధమవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ సురేష్, డీజీఎంలు ఎస్ అనిల్ కుమార్, కృష్ణారెడ్డి, సివిల్ హెచ్ఓడి రవికుమార్, ఎన్విరాన్మెంటల్ ఆఫీసర్ మురళీ కృష్ణ యాదవ్, సీనియర్ పీఓ పాల్ సృజన్, క్రీడాకారులు, కళాకారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

## పండుగ విషాదం కాకూడదు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

### రాష్ట్రవ్యాప్తంగా నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు



**కెరమెరి, అక్టోబర్ 9 (జనంసాక్షి)** రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. ఈ నెల 10 నుంచి 22 వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవులు ఉంటాయని విద్యాశాఖ అధికారులు తెలిపారు. తిరిగి 23వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. దసరా సెలవుల నేపథ్యంలో పిల్లలు ఇంటి వద్దనే ఉంటారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులు, పోలీసులు సూచిస్తున్నారు.

**తల్లిదండ్రులు పాటించాల్సిన జాగ్రత్తలు:**
పిల్లలను ఒంటరిగా చెరువులు, కుంటలు, బావుల వద్దకు వెళ్లనివ్వవద్దు. విద్యుత్ స్తంభాలు, వైర్ల జోలికి వెళ్లకుండా చూడాలి. రోడ్డు ప్రమాదాలు జరగకుండా వాహనాలు నడపనివ్వవద్దు, రోడ్డు దాటేటప్పుడు జాగ్రత్తలు చెప్పాలి. తెలియని వ్యక్తుల దగ్గరకు వెళ్లకుండా, మొబైల్ ఫోన్లకు అలవాటు పడకుండా చూడాలి. పండుగ సంబరాల్లో టపాసులు కాల్చేటప్పుడు పెద్దల పర్యవేక్షణ తప్పనిసరి. పండుగ సంతోషంగా జరుపుకోవాలి తప్ప పెను విషాదంగా మారకూడదని, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి పిల్లలకు రక్షణగా నిలవాలని కోరుతున్నారు.

**కెరమెరి మండలంలో హాస్టళ్లు ఖాళీ.. బస్టాండ్ కిటకిట:**
మండలంలో దసరా సెలవులు రావడంతో గురుకులాలు, హాస్టళ్లు ఖాళీ అయ్యాయి. తమ స్వగ్రామాలకు వెళ్లేందుకు విద్యార్థులు బస్టాండ్ ప్రాంతానికి చేరుకోవడంతో మార్కెట్ ప్రాంతం కిటకిటలాడింది.

# కుట్టు మిషన్ల పంపిణీ



**బెల్లంపల్లి, అక్టోబర్ 9, (జనంసాక్షి)** బెల్లంపల్లి పట్టణం 18వ వార్డులో శుక్రవారం మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతి రమేష్ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి అనేక సంక్షేమ పథకాలను అందిస్తుందని, అందులో భాగంగా కుట్టు మిషన్లు పంపిణీ చేశామని అన్నారు. ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమంపై ద్రుష్టి పెట్టి ప్రజా పాలన కొనసాగిస్తుందని అన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు మహ్మద్ అఫ్జద్, కాంగ్రెస్ నాయకులు పీక లక్ష్మణ్, పోచంపల్లి హరీష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురు

## ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహణ

### తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి -- ప్రిన్సిపాల్ కె. వీరస్వామి



**తొర్రూరు, అక్టోబర్ 09 (జనం సాక్షి):** ఎన్.స్.స్ వాలంటీర్లు మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వాటిని భావితరాలకు అందించాలని ప్రిన్సిపాల్ కె. వీరస్వామి అన్నారు. శుక్రవారం నాడు స్తానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నెల్లికుదురులో ఎన్.స్.స్ యూనిట్--×, యూనిట్--×× ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరస్వామి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు. అనంతరం ఎన్.స్.స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ మర్సకట్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, మన పండుగల వెనుక ఉన్న ప్రకృతి పరిరక్షణ సందేశాన్ని గుర్తించాలని సూచించారు. బతుకమ్మ పండుగలో ఉపయోగించే వివిధ రకాల పూలు జీవవైవిధ్యానికి ప్రతీకలని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం, సోదరభావం, సామాజిక స్పృహ పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.స్.స ప్రోగ్రామ్ ఆఫీసర్ పెద్దూరి వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శ్రీనివాస్, ప్రకాష్ బాబు, కవిరాజు, రఘురాం, నాగేశ్వరరావు, శ్రీనివాస్, రామ్మూర్తి, మహేందర్, బాబు, సుధాకర్, సతీష్, యాకన్న, సుభాష్ బోధనేతర సిబ్బంది శ్రావణ్, ప్రదీప్, గౌరీ శంకర్, లక్ష్మణ్. ఎన్.స్.స్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## అభ్యాస హై స్కూల్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు




**ఖిలా వరంగల్, అక్టోబర్ 09 (జనం సాక్షి )** గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 43 డివిజన్ గణేష్ నగర్‌లోని అభ్యాస హై స్కూల్ లో ఘనంగా తెలంగాణ బతుకమ్మ పండుగ వేడుకలు జరిగాయి స్కూల్ కరస్పాండెంట్ మీర్జా అఖిల్ ఉల్లా బెగ్ తెలంగాణ బతుకమ్మ వేడుకలు ప్రారంభం చేసి 6 ఫీట్ల బతుకమ్మ ను ప్రారంభించి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచుల కొంగు బంగారం మన బతుకమ్మ విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం పాఠశాలయొక్క కర్తవ్యం అని చెప్పారు బతుకమ్మను పేర్చడం ఒక కళా అని తీరొక్క పూలతో పూజించి ప్రతీ రంగు మనసును ఆకట్టుకునేలా అలంకరించడం ఆలోచింప చేసే ప్రయత్నం అని అన్నారు నేడు ఈ పండక తెలంగాణకే పరిమితం కాకుండా దేశ విదేశాలకు కూడా పరిచయం చేసిన ఘనత పాఠశాలల కే దక్కుతుంది అందుకు సంబంధించిన స్కూల్ వాళ్లందరినీ అభినందన పూర్వకంగా కృతజ్ఞతలు చెప్పారు బతుకమ్మ అందరిని సుఖసంతోషాలతో బతుకుమని దీవించమని కోరారు స్కూల్ ప్రిన్సిపాల్ మండల శిరీష మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన ఈ బతుకమ్మను పేర్చడం పూజించడం ఒక అదృష్టంగా భావించాలని అన్నారు ప్రకృతి లో లభించే తంగేడు గునుగు సీత జెడ బంతి చామంతి కట్ల మందార పూలతో మెదడుకు పదును లా ఆలోచించి అలంకరించడం జీవితం లో ఉన్నత స్థాయి కి చేరుకోవడం కోసం ఉపయోగ పడేలా విద్యార్థులను తీర్చి దిద్దడం అభ్యాస హై స్కూల్ చేస్తున్న ఒక గొప్ప ప్రయత్నం అని అన్నారు. రిటైర్డ్ పిడి చీకటి సమ్మయ్య స్కూల్ ఇంచార్జీ కోల రాము మాట్లాడుతూ తెలంగాణ బతుకమ్మ అందరికీ బతుకునిచ్చే దేవత అందరు దేవుళ్ళు భక్తులను తమ సన్నిధికి రప్పించుకుంటే ఈ బతుకమ్మ తమభక్తులతో గంగమ్మ ఒడికి రప్పించుకుని దీవించే తల్లి బతుకమ్మ అని అన్నారు అభ్యాస హై స్కూల్ యొక్క ఆనవాయితీ అని ఇంతటి కృషి చేసి విద్యార్థులను తీర్చి దిద్దుతున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందిస్తున్నాను అని అన్నారు అనంతరం విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో స్కూల్ లో బతుకమ్మ పాటలతో అలరించారు విద్యార్థినిలు ఎంతో సంతోషంగా బతుకమ్మలు పేర్చుకొచ్చి తమ ప్రతిభను చాటుకున్నారు పాఠశాల యాజమాన్యం వారిని అభినందించి వారికి బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో రజినీ భారతి సృజన స్రవంతి స్వాతి కవిత సుమయా రజిత ప్రణయ్ ఇంకా గౌరవ తల్లిదండ్రులు ఉపాధ్యాయుల పాల్గొన్నారు ఇబహ ఇరామ్ యాంకరింగ్ అందరిని ఆకట్టుకుంది.

## ప్రదీప్ రెడ్డి నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం కావాలి



**ఆత్మకూర్, అక్టోబర్ 9 (జనం సాక్షి):** భారతీయ జనతా పార్టీ యువ మోర్చా (బీజేవైఎం) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియామక మైన ఆత్మకూరు మండలం గూడెప్పాడ్ గ్రామానికి చెందిన పొరెడ్డి ప్రదీప్ రెడ్డి ఆనంద రామాలయంలో హనుమంతుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఆరుట్ల కేశవమూర్తి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ప్రదీప్ రెడ్డికి యువకులు పెద్దలు సన్మానం చేయడం జరిగింది. అనంతరం బీజేపీ మాజీ మండల అధ్యక్షులు ఇర్సడ్ల సదానందం ఆర్టిఐ జిల్లా కన్వీనర్ ఎదులాపురం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ ప్రదీప్ రెడ్డి నాయకత్వంలో యువకులను బిజెపిలోకి ఎక్కువ సంఖ్యలో చేరుతారని ఆశిస్తున్నాము. ప్రదీప్ రెడ్డి చురుకైన కార్యకర్త జిల్లా నాయకత్వం ఆలోచించి బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపిక చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాము ముందు ఇంకా మరెన్నో పదవులు పొందాలని ఆత్మకూరు మండలానికి పేరు తీసుకురావాలని కోరుచున్నాము. రాచర్ల నరేష్ సోషల్ మీడియా మండల కన్వీనర్ దినేష్ బిజెపి దామెర మండలం ప్రధాన కార్యదర్శి గండు ముఖేష్ బూత్ అధ్యక్షులు పెండ్యాల సునీల్ రెడ్డి ఊకంటి శ్రీనివాస్ రెడ్డి పరికి రాజు పరశురాం ప్రశాంత్ బీజేవైఎం నాయకులు బండి రాజశేఖర్ బండి శ్రవన్ కుమార్ పోరెడ్డి సమ్మిరెడ్డి పరికి దేవేందర్ శివ బలభద్ర సాయిరామ్ గ్రామ పెద్దలు యువకులు రితిక్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఎవరు దొంగిలించలేని సంపద విద్య మాత్రమే

**జిల్లా అదనపు కలెక్టర్, ఇన్చార్జి డిఈఓ పి చంద్రయ్య**





**బెల్లంపల్లి, అక్టోబర్ 9, (జనంసాక్షి)** ఎవరు దొంగిలించలేని సంపద విద్య మాత్రమేనని, విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా ఇన్చార్జి విద్యాధికారి పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మున్సిపల్ చైర్పర్సన్ దావ స్వాతిలతో కలిసి సిఎం బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఆకలితో ఉంటే ఉపాధ్యాయులు బోధించే పాఠాలపై ఏకాగ్రత తగ్గుతుందని, పాఠశాలకు వచ్చే విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించేందుకు ఆకలి సమస్య లేకుండా రుచికరమైన, నాణ్యమైన అల్పాహారం అందిస్తున్నామన్నారు. విద్యతో ఏదైనా సాధించవచ్చని, ఉన్నత స్థాయికి ఎదగవచ్చని, ఎవరు దొంగిలించలేని సంపద విద్య మాత్రమేనని, విద్య పంచేకొద్దీ పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థుల కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం అల్పాహార పథకాన్ని చేపట్టిందని, బాలికలు రక్తహీనత సమస్యతో బాధపడకుండా అల్పాహారం, మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ నాణ్యమైన విద్యా బోధన అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ క్రమంలో ఉపాధ్యాయులకు అవసరమైన శిక్షణను అందిస్తున్నామని, ఉపాధ్యాయులు ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య పెంపొందించి మంచిర్యాల జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో సకల సదుపాయాలు అందుబాటులో ఉంచి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మాట్లాడుతూ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ విద్య సంస్థలలో నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు సబ్జెక్టులపై అవగాహన కలిగి ఉండాలని, ఇంగ్లీష్ భాషపై పట్టు సాధించాలని, చదవడం, రాయడం, మాట్లాడడం నేర్చుకోవాలని అన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదిగేందుకు ప్రభుత్వం అనేక అవకాశాలను కల్పిస్తుందని, ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యతో పాటు క్రీడారంగం, సామాజిక బాధ్యతతో విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సంబంధిత అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మండల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో హియరింగ్ ప్రక్రియ నిర్వహణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ ఓటర్ల నుండి నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలు స్వీకరించి పరిశీలించాలని, హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో ఉండాలని, అనర్హుల వివరాలు ఎట్టి పరిస్థితులలో జాబితాలో ఉండకూడదని తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలోనే రైతులకు కరెంట్ కష్టాలు

- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య
- బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ధ్వజం
- రైతుల పక్షాన బిజెపి ధర్నా, అడ్డుకున్న పోలీసులు, ఉద్రిక్తతల మధ్య నాయకుల అరెస్టులు



వరంగల్ బ్యూరో, అక్టోబర్ 09 (జన సాక్షి) అధికారంలోకి వస్తే రైతులకు స్వర్ణధామం చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం, నేడు అన్నదాతలను నట్టేట ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు బస్వాపురం నరసయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనం, అనాలోచిత విధానాల వల్లే నేడు రాష్ట్రంలో విద్యుత్ కోతలు పెరిగిపోయాయని మండిపడ్డారు. ప్రోగ్రాం కన్వీనర్ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి నేతృత్వంలో మరియు కిసాన్ మోర్చా వరంగల్ జిల్లా అధ్యక్షులు దండు కిషన్ ఆధ్వర్యంలో ఖమ్మం హైవే రోడ్డులోని తిమ్మాపురం సబ్‌స్టేషన్ వద్ద రైతులు, కిసాన్ మోర్చా నాయకులు ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్వాపురం నరసయ్య మాట్లాడుతూ, 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తామని ప్రగల్భాలు పలికిన కాంగ్రెస్ నాయకులు, ఇప్పుడు కనీసం 5-6 గంటలు కూడా నాణ్యమైన కరెంటు ఇవ్వలేక చేతులెత్తేసారని విమర్శించారు. కాంగ్రెస్ మార్క్ తుగ్లక్ పాలన వల్ల సకాలంలో విద్యుత్ అందక, బోర్ల కింద నీరు లేక వరి పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతులు కన్నీరుమున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది 'రైతు ప్రభుత్వం' కాదు, రైతుల రక్తం తాగే 'రాబందుల ప్రభుత్వం' అని దుయ్యబట్టారు. తక్షణమే కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతులకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేయాలని, లేనిపక్షంలో సీఎం ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీకి అధికార దాహం తప్ప రైతుల సంక్షేమం పట్టదని విమర్శించారు. వరంగల్ జిల్లాలో విద్యుత్ సరఫరా అస్తవ్యస్తంగా మారి, చేతికొచ్చిన పంటలు ఎండిపోతుంటే పాలకులు ఏసీ రూముల్లో ఉంటూ కాలక్షేపం చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి ఓట్లేసినందుకు ఈరోజు రైతులు రోడ్డు ఎక్కాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. ఎండిపోయిన ప్రతి ఎకరా వరి పంటను అధికారులు తక్షణమే సర్వే చేసి, బాధిత రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లాడి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాల వల్ల వరంగల్ జిల్లా వర్ధన్నపేట పరిసర ప్రాంతాల్లో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో బిజెపి జాతీయ కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ మెంబర్లు మర్తినేని ధర్మారావు, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్, మాజీ మేయర్ డాక్టర్ టి. రాజేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పడమట జగన్మోహన్ రెడ్డి, దేవర శీను, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నూతనకంటి శ్రీనివాస్ రెడ్డి, గంగారెడ్డి, యాదగిరిరావు, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వన్నాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, జలగం రంజిత్ రావు, సిద్దం నరేష్, ముత్తిరెడ్డి కేశవ రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు బన్న ప్రభాకర్, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి, అమృత రావు, మరియు వరంగల్ జిల్లా బిజెపి పదాధికారులు, వివిధ మోర్చా జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వాస్తవ లాభాలు వెంటనే ప్రకటించాలి

- రూ.6,315 కోట్లపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య డిమాండ్

**నస్పూర్ అక్టోబర్ 8, (జనంసాక్షి):** సింగరేణి అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికులకు సంస్థ ఆర్జించిన లాభాల్లో న్యాయమైన వాటా అందించాలని బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి, అందులో 40 శాతం వాటాను శాశ్వత కార్మికులకు చెల్లించాలని కోరారు. అలాగే ప్రతి కాంట్రాక్టు కార్మికుడికి రూ. 10 వేల చొప్పున అందించాలని స్పష్టం చేశారు. నూతన బొగ్గు గనుల అభివృద్ధి కోసం కేటాయించినట్లు పేర్కొన్న రూ. 6,315 కోట్ల నిధుల వినియోగంపై పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడిచినా లాభాల వివరాలను వెల్లడించకపోవడం కార్మిక కుటుంబాల్లో ఆందోళన కలిగిస్తోందని యాదగిరి సత్తయ్య అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా బీఎంఎస్ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 62.17 మిలియన్ టన్నుల రవాణా జరిగిందని తెలిపారు. కార్మికుల శ్రమతో సంస్థ పురోగతి సాధిస్తున్న నేపథ్యంలో వాస్తవ లాభాలను పారదర్శకంగా ప్రకటించి, కార్మికులకు రావాల్సిన ప్రయోజనాలను వెంటనే అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, ఏరియా కార్యదర్శి రాజారాం కిరణ్ కుమార్, జెల్ల తిరుపతి, అప్పల బీరయ్య, కుంట రాజు, కొమ్ము బాపు, కుమ్మరి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# తక్కువ వర్షపాతంతో రైతులకు తీవ్ర నష్టం

- గుడిహత్నూర్‌ను కరువు ప్రభావిత మండలంగా ప్రకటించాలి
- జిల్లా కలెక్టర్‌కు మండల కాంగ్రెస్ నాయకుల వినతి



**గుడిహత్నూర్: అక్టోబర్ 8,( జనం సాక్షి)** మండలంలో ఈ ఏడాది తక్కువ వర్షపాతం నమోదవడంతో రైతులు పంటల సాగులో తీవ్రంగా నష్టపోయారని, గుడిహత్నూర్ మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని మండల కాంగ్రెస్ నాయకులు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం గణనీయంగా తగ్గిందని, దీంతో పంటల సాగు ఆశించిన స్థాయిలో సాగక రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం కారణంగా పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మండలంలో పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, నష్టపోయిన అర్హులైన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు. రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, వారి ఆర్థిక ఇబ్బందులను తొలగించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోడసం దౌలత్ రావు, మండల ఉపాధ్యక్షుడు మోహితే మారుతి, మండల అధికార ప్రతినిధి ఆడే జైపాల్, మండల ప్రధాన కార్యదర్శి కాన్హే రాంకిషన్, కాంగ్రెస్ యువ నాయకుడు పవార్ రాంప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలో ఘనంగా కాన్షిరాం వర్ధంతి



**నూగూర్ వెంకటాపురం అక్టోబర్ 9(జన సాక్షి ):-** వెంకటాపురం మండల కేంద్రంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ ఆవరణలో ఎమ్మార్పిఎస్ ఆధ్వర్యంలోకాన్షిరాం వర్ధంతి ఘనంగా నిర్వహించారు.. ఈ సందర్భంగా వెకటాపురం మండలఎమ్మార్పిఎస్ అధ్యక్షులు యాసం రమేష్ మాదిగ మాట్లాడుతూ. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బహుజనుల రాజకీయ సాధికార్త మహనీయులు మాన్యశ్రీ కాన్సీరామ్ అని కొనియాడారు. దేశంలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలను చైతన్యవంతులను చేస్తూ సైకిల్ పాదయాత్రతో ఎన్నో ఉద్యమాలు చేసి భారతదేశంలో రాజకీయ పార్టీ బహుజన సమాజ్ పార్టీ(బిఎస్పీ ) స్థాపించి బహుజనులకు రాజ్యాధికారం సాధించిన గొప్ప ఘనత ఆయన కె దక్కిందని అన్నారు. రాజకీయ శాస్త్రవేత్త మాన్యశ్రీ కాన్సీరామ్ ఆలోచనలు స్ఫూర్తిగా తీసుకొని ఆయన ఆశయాల కోసం బహుజనులు నిరంతరం శ్రమించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు వెల్పుల మల్లేష్ మాదిగ, సీనియర్ నాయకులు యాసం మహేష్ మాదిగ, ఎమ్ ఎస్పీ మండల అధ్యక్షులు కొడారి సత్యం మాదిగ, ఎమ్మార్పిఎస్ ఉపాధ్యక్షులు చెన్నం తిరుపతి మాదిగ, కాట మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో
# మిన్నంటిన బతుకమ్మ సంబరాలు



**బెల్లంపల్లి, అక్టోబర్ 9, (జనంసాక్షి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలలో భాగమైన బతుకమ్మ పండుగ సంబరాలు శుక్రవారం బెల్లంపల్లి డిగ్రీ, పీజీ కళాశాలలో మిన్నంటాయి. కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కాంపల్లి శంకర్ తెలిపారు. ఏటా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు, అధ్యాపకులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ముందస్తు బతుకమ్మ సంబరాల కోసం కళాశాల మైదానంలో పెద్ద ఎత్తున షామియానా ఏర్పాటు చేశారు. అనంతరం మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు. అనంతరం ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు కొబ్బరికాయలు కొట్టి బతుకమ్మ ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు, విద్యార్థులు అందరూ బతుకమ్మ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. వెళ్లి రా బతుకమ్మ.. మళ్లీ రా బతుకమ్మ.. అంటూ ఆటపాటలతో హోరెత్తించారు. బతుకమ్మ పాటలకు తగ్గట్టుగా నృత్యాలు చేస్తూ కార్యక్రమాన్ని ఆద్యంతం ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఎఅనంతరం బతుకమ్మలను స్థానిక పోచమ్మ చెరువులో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎంఏ రేష్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, సూపరింటెండెంట్ పుప్పాల శ్రీనివాస్, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా ముందస్తు బతుకమ్మ సంబరాలు



**దిలావర్‌పూర్, అక్టోబర్ 09, (జనం సాక్షి):** దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని ఆదర్శ విద్యార్థి పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ వస్త్రాలు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, కోలాటాలు వేస్తూ, నృత్యాలతో సందడి చేశారు. అనంతరం బతుకమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, సంప్రదాయబద్ధంగా పాటలు పాడుతూ స్థానిక చెరువులో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ అడీదేల శ్రీనివాస్ బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల్లో దాని ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఈ వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పండుగ శోభను మరింత పెంచారు.

# బ్రిలియంట్ స్కూల్‌లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



**మల్హర్, అక్టోబర్ 09(జనంసాక్షి)** మండల కేంద్ర పరదిలోని పెద్ద తూండ్ల గ్రామంలోని బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో కరెస్పాండెంట్ శశిధర్ రావు ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ పండుగ సంబురాలు నిర్వహించారు. రంగు రంగు పువ్వులతో బతుకమ్మ పేర్చి విద్యార్థులు నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు ఆటపాటలతో నృత్యాలు చేశారు ఈ సందర్భంగా పాఠశాల కరెస్పాండెంట్ వాలా శశిధర్ రావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగను అందరూ ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# సమత ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలు



**తొర్రూరు, అక్టోబర్ 09( జనం సాక్షి):** సమత డిగ్రీ, జూనియర్, వొకేషనల్,పారామెడికల్ కళాశాల ల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల కరెస్పాండెంట్ . కోట రఘునాథ రెడ్డి మాట్లాడుతూ, బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే విశిష్టమైన పండుగ అని పేర్కొన్నారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన రాష్ట్ర ప్రత్యేకతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెబుతుందని అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ లు వెంకన్న,రవీందర్ ,నవీన్ రెడ్డి లు మాట్లాడుతూ మాట్లాడుతూ యువత చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, మన పండుగల వెనుక ఉన్న ప్రకృతి పరిరక్షణ ఎంతో ముఖ్యమని తెలిపారు ,బతుకమ్మ పండుగలో ఉపయోగించే వివిధ రకాల పూలు జీవవైవిధ్యానికి ప్రతీకలని, ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఐకమత్యం, , సామాజిక స్పృహ పెంపొందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.స్.స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ తండా హరీష్, అధ్యాపక బృందం ,ఎన్.స్.స్ వాలంటీర్లు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరులో మండలంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- జూనియర్ కళాశాల, సీతానగరం, బేతంచెర్ల పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు
- తెలంగాణ వారసత్వ సంస్కృతీ పిల్లలకు నేర్పుదాం




**గూడూరు,అక్టోబర్09(జనంసాక్షి):** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం,ఎంపీపీఎస్ సీతానగరం ప్రాథమిక పాఠశాలలో,మచ్చెర్ల శివారు బేతంచెర్ల పాఠశాలలో, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ పరుశురాములు, సీతానగరం, బేతంచెర్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులి దేవేందర్, ముయ్యబోయిన వెంకన్న మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతి ప్రేమకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ విశిష్టతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యతాభావం పెంపొందుతాయని తెలిపారు. పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొనగా, విద్యార్థులు ఆనందోత్సాహాలతో బతుకమ్మ పాటలకు విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, ఆశ వర్కర్స్, అంగన్వాడీ సిబ్బంది నృత్యాలు చేసారు. ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు చర్ప దేవి,జన్ను రాజమౌళి,కమల, శ్రీలత, కవిత, పద్మ,రమ, వీరమ్మ, లక్ష్మిలు, బేతంచెర్ల పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతకు డిజిటల్ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరం

## మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** వివిధ ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు డిజిటల్ గ్రంథాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ గ్రంథాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించి, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులతో మంత్రి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ గ్రంథాలయాల్లో అందుబాటులో లేని పుస్తకాలను సైతం ఈ-గ్రంథాలయం ద్వారా అంతర్జాలంలో ఉచితంగా చదివే అవకాశం ఉంటుందని తెలిపారు. పోటీ పరీక్షలకు అవసరమైన నాణ్యమైన అధ్యయన సామగ్రిని డిజిటల్ రూపంలో పొందవచ్చని పేర్కొన్నారు. ప్రభుత్వం వివిధ శాఖల్లో ఉద్యోగ నియామకాలు చేపడుతున్న నేపథ్యంలో నిరుద్యోగ యువతకు డిజిటల్ గ్రంథాలయం ఎంతగానో తోడ్పడుతుందని, అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పట్టుదలతో చదివి ఉద్యోగాలు సాధించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో డిజిటల్ గ్రంథాలయ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకుని 10 కంప్యూటర్లు, అవసరమైన సామగ్రి సమకూర్చిన కలెక్టర్ రాహుల్ శర్మను మంత్రి అభినందించారు. రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, జిల్లాలోని అన్ని మండలాల్లో గ్రంథాలయాల ఏర్పాటుకు వేగవంతమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, గ్రంథాలయ కార్యదర్శి రాజేంద్రప్రసాద్, గ్రంథపాలకురాలు శారద, ప్రజాప్రతినిధులు, పాఠకులు, పోటీ పరీక్షల అభ్యర్థులు పాల్గొన్నారు.

# శాత్రాజ్‌పల్లిలో అటవీ శాఖ అధికారుల హెచ్చరిక

- వాహనాలు సీజ్ భారీ జరిమానాలు
- ఫారెస్ట్ సెక్షన్ అధికారి వినోద్



**మల్హర్, అక్టోబర్ 09(జనంసాక్షి)** మండల కేంద్రమైన తాడిచర్లలోని ఆమ్లెట్ గ్రామమైన శాత్రాజ్ పల్లి లో బ్లాక్-2 పరిహారం కోసం నిర్మిస్తున్న ఇళ్లకు ఇతర గ్రామాల నుంచి పాత గుడిసెల కలపను కొనుగోలు చేసి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని అటవీ శాఖ అధికారులు హెచ్చరించారు. శుక్రవారం శాత్రాజ్‌పల్లిలో అవగాహన కార్యక్రమం నిర్వహించి హెచ్చరించారు. అనుమతులు లేకుండా పాత కలపను సైతం రవాణా చేయడం చట్టవిరుద్ధమని ఫారెస్ట్ సెక్షన్ అధికారి వినోద్ స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా కలప తరలించినా, అక్రమంగా ఇళ్లు నిర్మించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతి లేని కలపతో పాటు రవాణా వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ట్రాక్టర్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్లు మహేందర్, సతీష్, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నందిగుండం దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 09,(జనంసాక్షి ): పట్టణ శివారులోని గండి రామన్న క్షేత్రం సమీపంలోని నందిగుండం దుర్గామాత ఆలయంలో ఈ నెల 11 నుంచి 20వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, పూజలు నిర్వహించడంతోపాటు ప్రతిరోజూ భక్తులకు అన్నప్రసాదం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 18న కన్యాపూజలు, మహిషాసుర దహనం, 20న విజయదశమి సందర్భంగా బంగారు రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ నెల 25న అమ్మవారి విగ్రహాల సామూహిక నిమజ్జనం అనంతరం బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ సభ్యులు పోలిశెట్టి విలాస్, సాదం ఆనంద్, పూదరి జనార్దన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై పత్తి రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ



తాండూర్, అక్టోబర్ 09(జనం సాక్షి ) తాండూర్ మండల వ్యవసాయ కార్యాలయంలో జాతీయ ఆహార భద్రత మరియు పోషకాహార మిషన్ పరిధిలోని పత్తి ఉత్పాదకత మిషన్ (కపాస్ కాంతి) పథకం కింద శుక్రవారం రైతులకు రాయితీపై వ్యవసాయ ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. మండలంలో అధిక సాంద్రత పత్తి సాగు క్లోజర్ స్పేసింగ్ పద్ధతుల కింద మొత్తం 755 ఎకరాల్లో 100% రాయితీపై పత్తి ప్యాకెట్లను ఇప్పటికే రైతులకు అందజేశారు. ఆ పత్తి ప్యాకెట్లు పొందిన రైతులకు, పంట ఎదుగుదలకు మరియు సంరక్షణకు ఉపయోగపడేలా రాయితీపై అందించాల్సిన మెపిక్వాట్ క్లోరైడ్ (చమత్కర్)తో పాటు ఇతర రసాయనిక పురుగుమందులను ఈ సందర్భంగా రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లె సర్పంచ్ ఆకుల వెంకటేష్, కిష్టంపేట సర్పంచ్ సార్ల తిరుపతి, మాదారం 3 ఇంక్లైన్ చందనలా రవి కుమార్, నర్సాపూర్ సర్పంచ్ మాడవి ప్రభాత రావు, మాజీ ఎంపీపీ సిరంగి శంకర్, ఏఎంసీ డైరెక్టర్లు, సహాయ వ్యవసాయ సంచాలకులు వి. రాజానరేందర్, మండల వ్యవసాయ అధికారి కె. సుష్మ, ఏఈఓలు వెంకటేష్, రాకేష్ మరియు మండల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బచ్చన్ పాఠశాలలో బతుకమ్మ సంబరాలు

### పూల పండుగ బతుకమ్మ.. చిన్నారుల సందడి!



నిర్మల్, అక్టోబర్ 09,(జనంసాక్షి ) నటరాజ్ నగర్‌లోని బచ్చన్ అండ్ సంస్కర్ పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థులు రంగురంగుల పూలను తీసుకొచ్చి అందంగా బతుకమ్మలను పేర్చారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బతుకమ్మ పాటలు పాడుతూ, ఆటపాటలతో సందడి చేశారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను చిన్నారులు ఉత్సాహంగా జరుపుకున్నారు. వివిధ రకాల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి, వాటి చుట్టూ చేరి పాటలు పాడుతూ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఆనందాన్ని నింపడంతో పాటు, మన సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ అయ్యన్న మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ విశిష్టతను, తెలంగాణ సంస్కృతిలో దానికి ఉన్న ప్రత్యేక స్థానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే గొప్ప సంప్రదాయం బతుకమ్మ పండుగలో ఉందన్నారు. ఇలాంటి వేడుకల ద్వారా చిన్నారులకు మన పండుగలు, ఆచార వ్యవహారాలపై అవగాహన కలుగుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సింగరేణి భూపాలపల్లి ఏరియాలో కార్పొరేట్ లక్ష్య కమిటీ పర్యటన



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): భూపాలపల్లి ఏరియాలో శుక్రవారం కార్పొరేట్ లక్ష్య కమిటీ పర్యటించింది. ఈ పర్యటనలో భాగంగా ప్రణాళిక విభాగ ప్రధాన అధికారి, కమిటీ సమన్వయకర్త జి. దేవేందర్, ఉపరితల గనుల విభాగ ప్రధాన అధికారి పి. ఎలీషా, భూగర్భ గనుల విభాగ ప్రధాన అధికారి కె. యాదయ్య, పరిశోధన విభాగ ప్రధాన అధికారి ఎం.వి. నరసింహారావు, పారిశ్రామిక విభాగ అదనపు ప్రధాన అధికారి సిహెచ్. వెంకయ్య, రామగుండం నాణ్యత విభాగ ప్రధాన అధికారి జె. వెంకటరమణలతో పాటు ఇతర కమిటీ సభ్యులు భూపాలపల్లి ఏరియా ప్రధాన అధికారి కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా ప్రధాన అధికారి ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షతన వివిధ గనులు, విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2027-28 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించాల్సిన లక్ష్యం, ప్రణాళికలు, బొగ్గు ఉత్పత్తి, రవాణా, మట్టి వెలికితీత తదితర గనులకు అవసరమైన యంత్రాలు, పనిముట్లు, సదుపాయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఉద్యోగులందరూ కలిసికట్టుగా పనిచేస్తూ భద్రతతో ఉత్పత్తిని సాధించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## విద్యార్థులకు మత్తు పదార్థాలు విక్రయిస్తే చర్యలు తప్పవు

### బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్



బచ్చన్నపేట( జనం సాక్షి ) పాఠశాల పరిసర ప్రాంతాల్లో విద్యార్థులకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు విక్రయించకుండా కట్టడి చేసేందుకు వరంగల్ డ్రగ్ కంట్రోల్ టీమ్ శుక్రవారం బచ్చన్నపేటలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. వరంగల్ సీపీ శ్వేత ఆదేశాల మేరకు బచ్చన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జెడ్ పి హెచ్ ఎస్ ప్రభుత్వ పాఠశాల పరిసరాల్లో ఉన్న పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా శిక్షణ పొందిన డాగ్ స్క్వాడ్ సహాయంతో గంజాయి, ఇతర మత్తు పదార్థాల కోసం తనిఖీలు నిర్వహించారు. పాఠశాల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు.విద్యార్థులకు సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాలా, గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయించవద్దని షాపుల యజమానులకు అధికారులు సూచించారు. విద్యార్థులను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని తెలిపారు.ఈ సందర్భంగా బచ్చన్నపేట ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ, పాఠశాల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై నిఘా కొనసాగుతుందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని షాపుల యజమానులు నిబంధనలను పాటించాలని సూచించారు.

## చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య సేవలపై ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో ప్రత్యేక దృష్టి



ఏటూరునాగారం,అక్టోబర్ 09(జనంసాక్షి). గిరిజన ప్రాంతాల్లో చిన్నారుల సంక్షేమం, పౌష్టికాహారం, ప్రాథమిక ఆరోగ్య సేవల నాణ్యతను మెరుగుపరిచే లక్ష్యంతో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో శుక్రవారం చినబోయినపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం, సబ్ సెంటర్‌ను సందర్శించి పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో అందుబాటులో ఉన్న వసతులు, చిన్నారులకు సంబంధించిన ఏర్పాట్లు, కేంద్ర నిర్వహణ వివరాలను పరిశీలించారు. చిన్నారుల ఎదుగుదలకు పౌష్టికాహారం, ప్రాథమిక విద్య, పరిశుభ్రమైన వాతావరణం ఎంతో ముఖ్యమని, అంగన్‌వాడీ సేవలు నాణ్యతతో అందేలా సిబ్బంది బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం సబ్ సెంటర్‌ను సందర్శించిన పీఓ, ఆరోగ్య రికార్డులు, మందుల నిల్వలు, వైద్య పరికరాలు, ప్రజలకు అందుతున్న సేవలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవసరమైన ఆరోగ్య సేవలు సకాలంలో అందేలా చూడాలని, మందుల లభ్యత, రికార్డుల నిర్వహణపై శ్రద్ధ వహించాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శనల ద్వారా ప్రభుత్వ సేవల అమలును పరిశీలిస్తూ, గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఐటీడీఏ కృషి చేస్తోంది. చిన్నారుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన సేవలు సమర్థవంతంగా అమలయ్యేలా సంబంధిత శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్శన ప్రాధాన్యతను తెలియజేస్తోంది.

## బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



గూడూరు,అక్టోబర్09(జనంసాక్షి): త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థులను గెలిపించాలని మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల కన్వీనర్ దేశు సురేష్ గుప్తా పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం గూడూరు మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సమావేశం జరిగినది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎన్నికల కన్వీనర్ దేసు సురేష్ గుప్తా హాజరైనారు. ఈసందర్భంగా దేసు సురేష్ గుప్తా, రాసమల్ల వెంకన్న మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతుల ఎన్నికలని, విద్యావంతులందరూ భారతీయ జనతా పార్టీని బలపరుస్తారని అన్నారు. దేశ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ఎన్నికి ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచుకోవాలని అర్హులైన ఉపాధ్యాయులు పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమని ఓటర్లను చైతన్య పరుస్తూ ఎన్నికల సన్నద్ధతను వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చెల్పూరి వెంకన్న,మండల ఎమ్మెల్సీ కన్వీనర్ మాలోత్ బాలు నాయక్,కో-కన్వీనర్లు తాటి శ్రావణి,బూరుగు సాయికుమార్,మండల ప్రధాన కార్యదర్శి నల్లగొండ అనిల్,వార్డ్ మెంబర్లు వాంకుడోత్ మైబు శ్రీనివాస్,గుగులోతు వినోద,జిల్లా నాయకులు వాంకుడోత్ మోతిలాల్,పడాల నాగరాజ్ ,చెల్పూరి రాజు, బోడ వెంకన్న, మండల నాయకులు గుగులోత్ దేవేందర్, గుండెబోయిన మల్లేష్ యాదవ్,కోరె అనిల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**మహదేవపూర్, అక్టోబర్ 9 (జనంసాక్షి):** మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రమేష్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసయ్య . స్థానిక సర్పంచ్ హసీనాబాను. మాట్లాడుతూ బతుకమ్మ అంటే కేవలం పూలతో పేర్చిన పండుగ మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతి పట్ల ప్రేమకు, కుటుంబ అనుబంధానికి, మహిళల ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. బతుకమ్మ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకునే ఈ పండుగ ప్రకృతి ఆరాధనకు, మహిళల ఐక్యతకు, తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీజ,ఎన్ఎస్ఎస్ పీవో రమేష్. సీనియర్ అధ్యాపకులు ప్రసాద్, అబ్దుల్ గని, సమ్మయ్య, సదాశివ్, సదానందం, సంధ్య, శ్రీనివాస్, మహేష్, సనత్, సునీల్, రమా, నాన్ టీచింగ్ సిబ్బంది లక్ష్మణ్, రాజయ్యతో పాటు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## భూపాలపల్లిలో సురక్షిత పేలుడు పద్ధతులపై అవగాహన సదస్సు




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి ఏరియాలో శుక్రవారం గనుల్లో ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగంతో సురక్షిత పేలుడు పద్ధతులపై గనుల అధికారులు, పర్యవేక్షకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. గనుల భద్రతా సంచాలకాలయం దక్షిణ మధ్య మండలం, హైదరాబాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఏరియా ప్రధాన అధికారి ఏనుగు రాజేశ్వర్ రెడ్డి అధ్యక్షత వహించగా, హైదరాబాద్-1 ఉప సంచాలకులు టి. హరి ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గనుల్లో పేలుడు కార్యకలాపాలను సురక్షితంగా నిర్వహించడం, ఎలక్ట్రానిక్ డిటోనేటర్ల వినియోగంలో పాటించాల్సిన భద్రతా ప్రమాణాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పేలుడు సమయంలో అధికారులు, పర్యవేక్షకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. గనుల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ నిర్దేశించిన భద్రతా నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పేలుడు కార్యకలాపాల్లో నిర్లక్ష్యానికి తావు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ ప్రమాదరహిత గనుల కార్యకలాపాల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అధికారి ప్రత్యేకాధికారి రామన్ వి. పాఠక్, కేటీకే-1 గ్రూపు ఏజెంట్ ములుకుంట్ల తిరుపతి, అన్ని గనుల నిర్వాహకులు, అధికారులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ నియామకం



**గోవిందరావుపేట అక్టోబర్09( జనం సాక్షి) :** తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ములుగు జిల్లా కన్వీనర్గా రేండ్ల సంతోష్ పటేల్ ను నియమించారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన రేండ్ల సంతోష్ పటేల్ తెలంగాణ ఉద్యమంలో,క్రియశీలకంగా పనిచేసినందుకు గుర్తించి ఆ పదవిని తెలంగాణ ఉద్యమ ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ గుడిమల్ల రవికుమార్ తెలిపారు. అనంతరం రేండ్ల సంతోష్ మాట్లాడుతూ గుర్తించి పదవిని అప్పగించినందుకు బాధ్యతతో ముందుకు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కుడికాల.భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జినుకల లక్ష్మణరావు పటేల్, వ్యాసబట్టు మధుసూదన్ రాజు,రాష్ట్ర నాయకులు,పంచగిరి రమేష్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు టీ-షర్టుల పంపిణీ

### విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించడమే లక్ష్యం




**కాళేశ్వరం , అక్టోబర్ 9 , ( జనం సాక్షి)** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం లోని పీఎం శ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు కాటారపు శేఖర్ ఆధ్వర్యంలో టీ-షర్టులను అందజేశారు. విద్యార్థులను క్రీడల పట్ల ప్రోత్సహించడంతో పాటు, వారిలో క్రీడాస్ఫూర్తి, ఐకమత్యం, క్రమశిక్షణను పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని, పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహన్ రెడ్డి, ఉప సర్పంచ్ చెమ్మాల సుధీర్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన బీజేపీ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి



**టేకుమట్ల అక్టోబర్ 09 జనంసాక్షి** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం కుందనపల్లి గ్రామంలో మృతి చెందిన దేశెట్టి సమ్మయ్య కుటుంబాన్ని, వెంకట్రావుపల్లి గ్రామంలో ఇటీవల పరమపదించిన పెరుమండ్ల నర్సయ్య కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, భూపాలపల్లి నియోజకవర్గ ఇన్చార్జి చందుపట్ల కీర్తి రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులకు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కష్టకాలంలో వారికి అండగా ఉంటామని కీర్తి రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజ్ గౌడ్, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దేశెట్టి గోపాల్, మండల ప్రధాన కార్యదర్శి బండారి సమ్మయ్య, బీజేవైఎం జిల్లా నాయకుడు పంజాల కుమార్, బీజేపీ జిల్లా నాయకుడు కుర్ర సురేందర్ రెడ్డి, చిట్యాల విజయకుమార్, బూత్ అధ్యక్షుడు స్వామి, మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి సిరికొండ ప్రశాంత్ పరామర్శ

### దహన సంస్కారాలకు రూ.5 వేల ఆర్థిక సాయం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి మండలంలోని గొర్లవేడు గ్రామానికి చెందిన గుర్రం సమ్మయ్య గౌడ్ మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నేత సిరికొండ ప్రశాంత్ పరామర్శించారు. దహన సంస్కారాల నిమిత్తం రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడైన గుర్రం సమ్మయ్య గౌడ్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి విషయం తెలుసుకున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి తనయుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సిరికొండ ప్రశాంత్ వెంటనే గ్రామానికి చేరుకున్నారు. సమ్మయ్య గౌడ్ పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## వెంటనే పీఆర్సీ ప్రకటించాలి

### టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ గౌడ్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):**36 నెలలు గడిచినా వేతన సవరణ సంఘం నివేదిక తెప్పించకపోవడం చాలా విషాదకరమని, 51 శాతం అదనపు వేతనంతో వెంటనే వేతన సవరణ అమలు చేయాలని టీఎన్జీఓ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బూరుగు రవికుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం టీఎన్జీఓ భవన్లో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల ఆరోగ్య పథకం లోపభూయిష్టంగా ఉందని, అన్ని పెద్ద ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యాన్ని అందించాలని అన్నారు. ఆరోగ్య పథకంలో ఉచిత వైద్యం అందక మృతి చెందిన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బకాయి పడిన ఉద్యోగుల బిల్లులను వెంటనే చెల్లించాలని జిల్లా కార్యదర్శి ఎ. దశరథరామారావు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు సురేందర్ రెడ్డి, అన్వర్, మురళీధర్ రెడ్డి, సలీంరాజు, శ్రీదేవి, ప్రవీణ్ కుమార్, సాంబశివరావు, సుకుమార్, మజీద్, జన్నుకుమార్, బి.ఇ. రాణి, రణధీర్, రేష్మ, ప్రసాద్, దేవేందర్, విజయ్, ప్రశాంత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## గోవిందరావుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

### ప్రధానోపాధ్యాయులు, రఘురాం ఆధ్వర్యంలో, విద్యార్థులు,,ఉపాధ్యాయులతో ఘనంగా జరిగాయి




**గోవిందరావుపేట అక్టోబర్09( జనం సాక్షి ):** తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు, ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, ప్రతీక బతుకమ్మ పండుగ, ఆ పండుగను పురస్కరించుకొని, ఈరోజు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, ప్రధానోపాధ్యాయులు రఘురాం. ఆధ్వర్యంలో, ఉపాధ్యాయులు పిల్లలతో, పాటు వారి తల్లిదండ్రులు, తో , రంగురంగుల పూలతో, అందమైన బతుకమ్మలు పేర్చుతూ, విద్యార్థులకు బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ, సాంప్రదాయ,నృత్యాలతో, కోలాటాలతో, బతుకమ్మ పండుగ సంబరాలు చేసుకున్నారు.

## రామాలయం కమిటీ చైర్మన్గా ధన్నపునేని కిరణ్కుమార్



**ఏటూరునాగారం,అక్టోబర్ 09 (జనంసాక్షి).** సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ ధన్నపునేని కిరణ్కుమార్ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయంలో నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. మాజీ చైర్మన్ అలువాల శ్రీనివాస్ అధ్యక్షతన నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఉపాధ్యక్షులుగా పెండ్యాల సంతోష్, బాల్య ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా తాడూరి దీనబాంధవస్వామి, కోశాధికారి కత్తెర శ్రీనివాస్, ప్రచార కార్యదర్శులుగా వెలకంటి శ్రీనివాస్, దాసరి కృష్ణ, సిసింద్రి, బాల్య రాజేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బాలోజు బ్రహ్మం, చిత్తుబొత్తుల సదానందం, గౌరవ సలహదారులుగా పర్వతాల లాలయ్య, ఇర్సవడ్ల వెంకన్న, చిప్ప అశోక్, ఎగ్గడి వెంకటేశ్వర్లు, అలువాల శ్రీనివాస్, పెండ్యాల ప్రభాకర్లను ఎన్నకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో అసమ్మతి సెగలు

సరైన చర్యలు తీసుకోలేదని అందువల్ల రైతులు నష్ట పోయారని ఆరోపించారు.గోదావరి జలాల అంశాన్ని సైతం రాజకీయలబ్ది కోసంఉపయోగించుకుంటు రైతులను మోసం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే అనుచరుల తీరుపై విమర్శలు చేశారు.

**అసమ్మతికి కారణం ఎమ్మెల్యే తీరే**

నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఐక్యంగా ఉండాల్సిన సమయంలో అంతర్గత విభేదాలు పెరగడానికి ఎమ్మెల్యే వ్యవహారశైలే కారణమని పలువురు నాయకులు విమర్శించారు. తమ అభిప్రాయాలను, సమస్యలను వినిపించుకునే అవకాశం లేకపోవడం, కొందరి మాటలకే ప్రాధాన్యత ఇవ్వడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. అధికారుల దగ్గర సైతం ఎమ్మెల్యే అనుచరుల మాటే చెల్లుబాటు అవుతుందని ,నిజమైన కాంగ్రెస్ నాయకులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. బయ్యారం సొసైటీ లో జరిగిన పరిణామాలు, ఒక సీనియర్ కాంగ్రెస్ నాయకుడున్ని అధికారులు చట్టపరిధిలో చైర్మన్ చేసిన తర్వాత ఎమ్మెల్యే అనుచరులు వ్యవహరించిన తీరును దుయ్యబట్టారు. 75 సంవత్సరాల ఓ సీనియర్ కాంగ్రెస్ నాయకునికి పార్టీ ఇచ్చే గౌరవమిదేనా అని ఎమ్మెల్యే ను సూటిగా ప్రశ్నించారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై ఉందని, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం పెంచి అందరినీ కలుపుకొని వెళ్లాలని సూచించారు. లేక పోతే నియోజక వర్గంలో కాంగ్రెస్ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు

పార్టీలో తమకు తగిన గుర్తింపు దక్కడం లేదని అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, తాము కాంగ్రెస్ పార్టీని వీడే ప్రసక్తే లేదని నాయకులు స్పష్టం చేశారు. తామే నిజమైన కాంగ్రెస్ వారసులమని పేర్కొంటూ, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ రెడ్డి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మొత్తంగా, బయ్యారం, గార్ల మండలాల కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళనం పార్టీలో అంతర్గత అసంతృప్తికి అద్దం పట్టింది. కార్యకర్తలకు గుర్తింపు, రైతుల సమస్యల పరిష్కారం, నాయకుల మధ్య సమన్వయం వంటి అంశాలపై నాయకులు,ప్రజాప్రతినిధులు ఆవేశపూరిత ప్రసంగాలు చేశారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఎమ్మెల్యే తన వ్యవహారశైలిలో మార్పు తీసుకొస్తారా.... అసంతృప్త నాయకులను కలుపుకొని పార్టీని ఐక్యంగా ముందుకు నడిపిస్తారా... అన్నది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో గార్ల మండలంనుండి జిల్లా కాంగ్రెస్ నాయకులు గుండా వెంకటరెడ్డి నాయకత్వంలో పలువురు ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొనగా బయ్యారం మండలంలోని నాయకులు సనప సోమేష్,పోలేబోయిన వేంకటేశ్వర్లు, బత్తిని రామ్మూర్తి గౌడ్,పూనెం రమేష్, బొల్లి వెంకటకృష్ణ, నండగిరి భద్రయ్య, ప్రమోద్ రెడ్డి,పెద్దిని వెంకటేశ్వరావు,సర్పంచ్ లు శాంతి,జయంతి,కృష్ణ కుమారి తోపాటు పలువురు సర్పంచులు,మాజీ ప్రజాప్రతినిధులు,పాల్గొన్నారు.ఈ సమావేశానికి కామేపల్లి,ఇల్లందు మండలాల నాయకులు పాల్గొని వారుకూడా వారి అసమ్మతి ని బహిర్గతం చేయడం కొసమెరుపు.

## టిపిటిఎఫ్ కొత్తగూడ మండల కమిటీ ఎన్నిక




కొత్తగూడ అక్టోబర్ 9 (జనంసాక్షి) : తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) కొత్తగూడ మండల శాఖ నూతన కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి.శుక్రవారం మండల పరిధిలోని ఎంపీపీఎస్ ఓటాయి పాఠశాల ప్రాంగణంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాలాస్తి రమేష్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల నూతన కార్యవర్గాన్ని సభ్యులందరి ఆమోదంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.టిపిటిఎఫ్ మండల నూతన అధ్యక్షుడిగా మేడ నరసింహారావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్ది యాదగిరి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నుకోబడిన నూతన అధ్యక్షుడు మేడ నరసింహారావు ప్రధాన కార్యదర్శి ఎల్ది యాదగిరి, ఉపాధ్యక్షుడు కాశబోయిన భరత్, మహిళా ఉపాధ్యక్షురాలు ఇరుప కీర్తిప్రియ, కార్యదర్శులు ఊనావత్ రవి, కొప్పుల రేవేశ్వర్, సిద్దమైన సాంబయ్య ఆడిట్ కమిటీ కన్వీనర్ జి. వెంకన్న సభ్యులుగా పి. జ్యోతి, అకాడమిక్ సెల్ కన్వీనర్ ఎం. ప్రవంత్, జే. సుప్రియ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి, హక్కుల సాధనకు నూతన కమిటీ నిరంతరం ముందుంటుందని ఈ సందర్భంగా ఎన్నికైన నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిపిటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మల్లెల సాంబయ్య, మండల కమిటీ నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కార్యవర్గానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

## దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

జిల్లా ఎస్పీ సూచించారు. ఉత్సవాల సందర్భంగా ప్రజలు సంయమనం పాటిస్తూ, ఇతరుల మత విశ్వాసాలను గౌరవించాలని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనా, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించినా వెంటనే డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరిస్తూ,మండపాల నిర్వాహకులు నిబంధనలను పాటించి, దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను సురక్షితంగా, ప్రశాంతంగా విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆకాంక్షించారు.

## ఉత్తమ అవార్డు అందుకున్న హనుమకొండ జిల్లా కలెక్టర్



హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 9 (జనం సాక్షి) :సమాచార హక్కు చట్టం అమలులో ఉత్తమ పనితీరుకు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అవార్డును అందుకున్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో రాష్ట్రస్థాయి సమాచార హక్కు వారోత్సవాలు- 2026 కార్యక్రమంలో ఈ అవార్డును రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అవార్డును అందుకున్నారు. జిల్లాలో సమాచార హక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. సమాచార హక్కు చట్టం అమలులో జిల్లాకు లభించిన ఈ అవార్డు ప్రజాకేంద్రిత పాలన, పారదర్శకత, జవాబుదారితనాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రోత్సాహాన్నిస్తుందని జిల్లా కలెక్టర్ చాహత్ పాయి అన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పారదర్శకమైన పరిపాలన కొనసాగించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని పేర్కొన్నారు.

## టపాసులు కొనుగోలులో అప్రమత్తంగా వ్యవహరించాలి

**వరంగల్ ఎంజీఎం, అక్టోబర్ 9 (జనంసాక్షి):** రాబోయే దీపావళి,దసరా పండుగల సందర్భంగా టపాసులు కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఫైర్ వర్క్స్ ట్రేడర్ సుప్రీం కోర్టు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా అమ్మకాలు సాగిస్తున్నారని, నాణ్యత లేని ,ప్రమాదకరమైనవి అమ్మకాలు జరుపుతున్నారు తద్వారా ఆర్థికంగా, ఆరోగ్యపరంగా , పర్యావరణ నష్ట పరంగా వినియోగదారులు తీవ్రంగా నష్ట పోతారని అన్నారు సీ. సీ. సీ. చైర్మన్ మొగిలిచర్ల సుదర్శన్. శివనగర్లోని సమాఖ్య కార్యాలయం లో వరంగల్, ఉమ్మడి జిల్లా సమాఖ్య ప్రతినిధుల సమావేశం మురారిశెట్టి యశ్వంత్ కుమార్ అధ్యక్షతన జరుగగా పాల్గొని వివరించారు.ట్రై సిటీ లో పెద్దఎత్తున జరుగుతున్న బాణసంచా అమ్మకాలకు తప్పనిసరిగా , సర్టిఫికెట్ ఆఫ్ సైంటిఫిక్, ఇండస్ట్రియల్ రీసెర్చ్ - నేషనల్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూషన్ మరియు "పెట్రోలియం అండ్ ఎక్స్ప్లోజన్ సేఫ్టీ ఆర్గనైజేషన్ వారి సర్టిఫికెట్లు ఉన్న ఉత్పత్తులనే అమ్మాలి, ప్రతి పాకెట్ పై "క్యూ ఆర్ "కోడ్ ముద్రించబడాలి, అవీ కేవలం గ్రీన్ క్రాకర్స్ అయి ఉండాలన్నవి ప్రధాన నిబంధనలు కాబట్టి వినియోగదారులు అప్రమత్తంగా గమనించాలని కోరారు. సమాఖ్య ఈ మధ్య నిర్వహించిన టెస్ట్ పర్చేజ్ లో వరంగల్ చిన్న బ్రిడ్జి, హంటర్ రోడ్,పాత బీటుబజార్, హన్మకొండ, కాజీపేట్ ప్రాంతాల్లో




కొనుగోలే లో ఎవ్వరు ఒరిజినల్ బిల్లు లు ఇవ్వలేదు, అధిక ధరలు, షాపు షాపుకి ఒకే వస్తువు ధరలు వ్యత్యాసాలున్నాయి, ప్యాకెట్ల పై" క్యూ ఆర్" కోడ్లు లేవు. ఎక్కడ గ్రీన్ క్రాకర్స్ కన్పించలేదు. ఈ అన్ని సమస్యలపై సంబంధిత అధికారులకు ఆధారిత ఫిర్యాదు చేయబోతున్నది సమాఖ్య. ముఖ్యంగా కిలో తూకం ద్వారా అమ్మకాలు జరపొద్దు,అది చట్ట విరుద్ధం. ఆ విధానంలో లో కొనకూడదు అందులో సగానికి సగం ధరలోనూ,నాణ్యతలోనూ మోసం జరుగుతున్నదని అన్నారు. ఈ విషయాలు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా సమాఖ్య ప్రతినిధులు వివిధ మాధ్యమాల ద్వారా వినియోగదారులకు తెలిపి చైతన్య పరచాలని కోరారు. ఈ సమావేశం లో జిల్లా ప్రతినిధులతో పాటు టెక్నికల్ అండ్ లీగల్ అడ్వైసర్ లు దిద్ది లక్ష్మీనారాయణ, బండి అనిల్ కుమార్, రాయబారపు భిక్షపతి, శ్రీనివాస్, కిషన్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

## విలేకరుల హక్కుల కోసం ఉద్యమిస్తాం

**ఐక్యవేదిక మహబూబాబాద్ జిల్లా కోశాధికారిగా కాసర్ల సాంబయ్య**



కొత్తగూడ అక్టోబర్ 9 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక మహబూబాబాద్ జిల్లా కోశాధికారిగా కాసర్ల సాంబయ్యను నియమిస్తున్నట్లు పంజాల వెంకట్ గౌడ్ ప్రకటించి, ఆయనకు నియామక పత్రం అందజేశారు. జర్నలిస్టుల న్యాయమైన హక్కులు, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ముందుండి ఉద్యమిస్తుందని ఐక్యవేదిక జిల్లా కోశాధికారి కాసర్ల సాంబయ్య అన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న విలేకరుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో 80 శాతం ఫీజు రాయితీ కల్పించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి మిట్టపల్లి అంజయ్య, తాళ్లపల్లి చంద్రమౌళి గౌడ్, సంగం మహేందర్, మద్దెల సాంబయ్య గౌడ్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు ఈసం సమ్మయ్య, కొత్తగూడ మండల అధ్యక్షుడు మాసం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిపక్షాలు తీరు మార్చుకోవాలి

**భీమిని అక్టోబర్ 9 (జనంసాక్షి) :** కేంద్రం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అధికారులోకి రావడానికి చేతకాక కాంగ్రెస్ మరియు దాని మిత్రపక్షాలు ఎన్డీఏ ప్రభుత్వం ప్రధానమంత్రి మోడీపై బురదజల్లే ప్రయత్నం చేస్తూ ఓటు చోరీ అంటూ ఈవీఎంలు సక్రమంగా పనిచేయడం లేదని ఆరోపణలు చేస్తూ తమ చేతకానితనాన్ని చాటుకుంటున్నాయని మంచిర్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర గౌడ్ అన్నారు శుక్రవారం భీమిని మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ జెండాను నాయకులు కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆధ్వర్యంలో ఎన్నో అభివృద్ధి పథకాలను ప్రవేశపెడుతూ ప్రపంచ దేశాల్లో భారతదేశ ఔన్నత్యాన్ని చాటుతున్న వ్యక్తి ప్రధానమంత్రి అని ముఖ్యమంత్రిగా ప్రధానమంత్రిగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామ గ్రామాన సంబరాలు నిర్వహిస్తున్నామని ఇందులో భాగంగానే భారతీయ జెండాను ఆవిష్కరించి ప్రధానమంత్రి చేపడుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నామని. తెలంగాణ రాష్ట్రంలో పార్టీలు బలోపేతం చేసి వచ్చే ఎన్నికల వరకు రాష్ట్రంలో బిజెపిని అధికారులకు తేవడమే లక్ష్యంగా కార్యకర్తలు అందరూ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పట్టి వెంకటకృష్ణ రాచర్ల సంతోష్ కుమార్ శ్రీధర్ మండల నాయకులు కొంక సత్యనారాయణ ఇప్పకాయల వెంకటేశం సంఘర్ష్ బాల సురేంద్రరావు కొంక సత్యనారాయణ నిత్యం పురుషోత్తం గౌడ్ కొంక శ్రీనివాసు ఇప్పకాయల వెంకన్న బతిన్ రమేష్ పోతరాజుల శంకర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



## సోమేశ్వరుడి హుండీ ఆదాయం రూ.21,98 లక్షలు

**పాలకుర్తి, అక్టోబరు 09(జనంసాక్షి)+** శ్రీ సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానంలో శుక్రవారం హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.21 లక్షల 98 వేల 507 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో లక్ష్మీప్రసన్న తెలిపారు. మండల కేంద్రంలోని ఆలయ కళ్యాణ మండపంలో ఈ ఏడాది మార్చి 24 నుంచి అక్టోబరు 9 వరకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని వల్మిడి దేవస్థానం ఈవో వెంకటరెడ్డి పర్యవేక్షణలో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమేశ్వరాల యానికి వచ్చిన భక్తులు సమర్పించిన 200 రోజుల హుండీ లెక్కించినట్లు తెలిపారు. 5 గ్రాముల 580 మిల్లి గ్రాముల, మిశ్రమ బంగారం, 1 కేజీ 359, 740 మిల్లి గ్రాముల మిశ్రమ వెండి, 230 అమెరికా డాలర్లు, 30 ఇంగ్లాండ్ ఫౌండ్లు, 150 నేపాల్ రూపీలు హుండీలో లభించినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.